ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

Published From Nizamabad

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275


ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

గురువారం | 04-06- 2026 | సంపుటి: 17, సంచిక: 61, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

## నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజంలో తెలంగాణ-దక్షిణాఫ్రికా

# పరస్పర సహకారం

### దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే బృందంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సమావేశం



- వాణిజ్య, సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ
- గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఏరోస్పేస్ రంగాల్లో అవకాశాలపై దృష్టి

హైదరాబాద్, జూన్ 3 (ప్రజాకలం) : తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ పాలస్ షిపోకోసా మషటైల్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, వాణిజ్య సహకారం, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్య విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, అనుమతుల ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలను ముఖ్యమంత్రి ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే విదేశీ సంస్థలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని స్పష్టం చేశారు. భారత్ పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాలస్ మషటైల్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం తమ బృందానికి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు.

తరువాయి 2వ పేజీలో...



## ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల

# భవిష్యత్‌కు భరోసా

### వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- ప్రత్యామ్నాయ పంటల సాగు, నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- పంట అవశేషాలకు నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవు

ఖమ్మం జూన్ 03(ప్రజా కలం న్యూస్ ) వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని వెల్లడించారు.

తరువాయి 2వ పేజీలో...

## గోదావరి పుష్కరాలు అత్యంత

# వైభవంగా నిర్వహిస్తాం


- ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు కేటాయించాం
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



హైదరాబాద్, జూన్ 3 (ప్రజాకలం) : 2027లో రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌అన్నారు. ఇప్పటికే గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 100 కోట్లు తొలి విడత విడుదల చేసిందనీ ఆయన తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...


## కలం కౌంటర్




## విమాన ఇంధన ధరల స్థిరత్వానికి

# రూ.10 వేల కోట్ల ఇంధన నిధి

## - కేంద్ర క్యాబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ, జూన్ 3 : పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విమాన ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ విమానయాన రంగానికి, ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ 'విమాన ఇంధన ధరల స్థిరీకరణ నిధి' ఏర్పాటు నిర్ణయానికి ఆమోదం లభించింది. ఈ ఇంధన నిధి కోసం రూ. 10,000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో విమాన ఇంధనం ధరలు పెరిగినప్పుడు ఆ భారం విమానయాన సంస్థలపై పడకుండా చమురు మార్కెటింగ్ సంస్థలకు ప్రభుత్వం ఈ నిధి నుంచి ఆర్థికసాయం అందిస్తుంది. ఇది వడ్డీలేని అడ్వాన్స్ రూపంలో అందుతుంది. దీనివల్ల ఇంధన ధరలు పెరిగినా చమురు సంస్థలు విమానయాన సంస్థలకు స్థిరమైన ధరలకే

తరువాయి 2వ పేజీలో...



## అత్యధిక కాలం పనిచేసిన

# ప్రధానిగా మోదీ

### - జూన్ 10న నెహ్రూ రికార్డ్ బ్రేక్

న్యూఢిల్లీ, జూన్ 3 : నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన

తరువాయి 2వ పేజీలో...

# ఒక గొప్ప తరం వెళ్ళిపోతోంది!

### - ఆ తరం వాళ్లు చెప్పిన సూచనలను ఈ తరం వాళ్లు నేర్చుకోవాలి




ధర్మారం, జూన్ 03 : (ప్రజా కలం ప్రతినిధి) గొప్పగా బతికిన వారు ఒక్కొక్కరుగా మనకు శాశ్వత వీడ్కోలు పలుకుతూ ఒక గొప్పతరం కనుమరుగవుతోంది. అన్నం తినేముందు ఇతరుల ఆకలిని గుర్తించిన తరం ఇరుకు ఇళ్లల్లో గొప్ప ప్రేమతో బ్రతికిన తరం బాధ్యతల్ని ఎరిగిన తరం నేను అనకుండా మనం అంటూ బతికిన తరం డిగ్రీలు లేకున్నా జీవితాన్ని చదివిన తరం గడియారం లేకున్నా సమయాన్ని సద్వినియోగం చేసుకున్న తరం ఇంటర్నెట్ చూడకుండా జ్ఞానాన్ని నింపుకున్న తరం కాలిక్యులేటర్ లేకున్నా లెక్కలు చేయగలిగిన తరం మొబైల్ ఫోన్ లు లేకున్నా స్నేహ సంభాషణలకు లోటు లేని తరం టీవీ లు లేకున్నా వినోదంగా కాలం గడిపిన తరం జిపిఎస్ లు లేకున్నా గమ్యం ఖచ్చితంగా చేరగలిగిన తరం సాంకేతికత లేకున్నా సుఖసం తోషాలతో బతికిన తరం ఏసీ లు కూలర్లు లేకున్నా ఆరుబయట హాయిగా నిద్రించిన తరం మినరల్ వాటర్ కు బదులు చెరువు/బావి నీళ్లు తాగి ఆరోగ్యంగా బతికిన తరం పిజ్జాలు, బర్గర్లు కాకుండా పీచు మిఠాయిలు, పేలాలు తిని ఆనందంగా బ్రతికిన తరం రాత్రిళ్ళు ఇంటి అరుగులపై హాయిగా కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా బ్రతికిన తరం ఆరో ఏడు వచ్చే వరకు పిల్లల బాల్యాన్ని ఆట పాటల తో నింపిన తరం ఏడు ఆ తర్వాత పైసా ఫీజు లేని సర్కారు బడుల్లో తెలుగు మీడియంలో పిల్లలను చదివించి - అటు తెలుగు లోనూ, ఇటు ఇంగ్లీష్ లోనూ పండితులు అయ్యేలా పిల్లలను తీర్చిదిద్దిన తరం కిలోమీటర్ల దూరాన్ని సైతం అవలీలగా నడవగలిగిన తరం క్రమశిక్షణ తప్పిన పిల్లవాడికి స్కూల్ లో టీచర్ నాలుగు దెబ్బలు వడ్డిస్తే - వాడికి మరో పది దెబ్బలు ఇంట్లో వడ్డించిన తరం వీధి నాటకాలను, తోలు బొమ్మలాటల ను, బుర్రకథలను ఆస్వాదించిన తరం సెన్సార్ అవసరం లేని సందేశాత్మక నలుపు-తెలుపు సినిమాలు చూసిన తరం ఇంటిముంగిటిని ముగ్గుల తో అలంకరించిన తరం పనిమనుషుల తో, యోగాలతో, జిమ్ లతో పని లేకుండా, బండెడు చాకిరీ చేసుకుంటూ, చెమట ను చిందించి వందేళ్లు బతికిన తరం బంధాలకు, బంధుత్వాలకు విలువనిచ్చిన తరం ఆస్తులకన్నా, ఆప్యాయ తలకు, అనుబంధాలకు ప్రాముఖ్యతనిచ్చిన తరం ఉమ్మడి కుటుంబాలు గా ఆనందంగా జీవించిన తరం భేదాభిప్రాయాలున్నా అందర్నీ కలుపుకుని వెళ్ళగలిగిన తరం వ్యాపారం లో కల్తీకి చోటివ్వని తరం ఇతరుల మేలు కోరుకున్న తరం నీతి నిజాయితీల తో మోసాలు చెయ్యకుండా బతికిన తరం రాళ్ల తిన్నా అరిగించుకో గలిగిన తరం కార్పొరేట్ హాస్పిటల్స్ లేకున్నా ఆరోగ్యంగా జీవించిన తరం హార్ట్ ఎటాక్, క్యాన్సర్ ల గురించి తెలియని తరం బీపీలు, షుగర్ లను దరిచేరనీయని తరం లాంతర్ల తో జీవితం లో వెలుగులు నింపుకున్న తరం కష్టాల్ని ధైర్యంగా ఎదుర్కొన్న తరం ఎంత ఉన్నా ఇంకా ఇంకా కావాలనే దురాశ లేకుండా ఆనందంగా జీవించిన తరం ఆడంబరాలకు దూరంగా ఉన్న తరం పోస్ట్ కార్డుల పై సంభాషణ లు జరిపిన తరం త్యాగాల తో పిల్లల భవిష్యత్ కు పునాదులు వేసిన తరం కులమతాలకు అతీతంగా సోదరభావం తో బతికిన తరం అలాంటి తరం లోని అపురూపమైన గొప్ప వ్యక్తులు నేడు ఒక్కొక్కరుగా మనల్ని విడిచి వెళ్లిపోతున్నారు వారిని కోల్పోతుంటే సర్వం కోల్పో తున్నట్టుగా అనిపిస్తుంది. వెళ్లిపోతున్న ఆ తరం వాళ్ల నుండి ఈ తరం ఏమీ నేర్చుకోకపోతే - భవిష్యత్తు కు అంధకారమే అవుతుందని ఆ తరం వాళ్ళు చెప్పిన సూచనలను ఈ తరం వాళ్లు నేర్చుకోవాలి

## పవన్ ను ఎవరూ అడ్డుకోలేదు..

# ప్రజలే అడ్డుకున్నారు

### జనసేన కొత్తగా పోటీ చేసేదేముంది?

### తెలంగాణ ముమ్మాటికి భూమిపుత్రుల జాగీరే
### పవన్ వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూన్ 3 (ప్రజాకలం) : తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 30 నెలలు అయింది. హస్తం పార్టీపై రాష్ట్రంలో అసంతృప్తి పెరుగుతోంది. ముఖ్యంగా రైతు భరోసా విషయంలో రైతులు అసంతృప్తిగా ఉన్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కూడా అన్నదాత ఆగ్రహానికి కారణమవుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) కాంగ్రెస్ 30 నెలల పాలనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అభివృద్ధి గురించి

తరువాయి 2వ పేజీలో...

### నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజంలో తెలంగాణ-దక్షిణాఫ్రికా

# పరస్పర సహకారం

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రత్యేక వేడుకల సమయంలో తెలంగాణలో ఉండటం గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధిని మష్టైల్ ప్రత్యేకంగా ప్రశంసించారు. భారతదేశంలో అత్యంత యువ రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణ అతి తక్కువ కాలంలోనే దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రజల కృషి, సృజనాత్మకత, సంకల్పబలం కారణంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. శాస్త్రీయ, సాంకేతిక, పారిశ్రామిక మరియు పెట్టుబడి రంగాల్లో తెలంగాణతో మరింత విస్తృత భాగస్వామ్యాన్ని దక్షిణాఫ్రికా కోరుకుంటోందని వెల్లడించారు. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, భారత్--దక్షిణాఫ్రికా సంబంధాలకు చారిత్రక నేపథ్యం ఉందన్నారు. సాంకేతికత, ఔషధ తయారీ, వ్యాక్సిన్ ఉత్పత్తి, రక్షణ, ఏరోస్పేస్, పరిశోధన, విద్య, ఆరోగ్యం, తయారీ రంగాలు, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు మరియు మౌలిక సదుపాయాల రంగాల్లో తెలంగాణ విశేష సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు. ఈ రంగాల్లో పరస్పర సహకారానికి అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే గ్రీన్ ఎనర్జీ, పునరుత్పాదక శక్తి, సుస్థిర అభివృద్ధి రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలు, సాంకేతిక రంగాలను అభివృద్ధి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా సంస్థలు తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణ-దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, పారిశ్రామిక, సాంకేతిక మరియు పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు, భవిష్యత్‌లో పరస్పర సహకారానికి కొత్త మార్గాలు తెరుచుకునే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాలకు ఈ భేటీ మరో కీలక ముందడుగుగా నిలిచింది.

### అత్యధిక కాలం పనిచేసిన

## ప్రధానిగా మోదీ

### - జూన్ 10న నెహ్రూ రికార్డ్ బ్రేక్

మొదటి పేజీ తరువాయి...

జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు. అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా కొనసాగారు. ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951--52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

### గోదావరి పుష్కరాలు అంత్యంత

# వైభవంగా నిర్వహిస్తాం

మొదటి పేజీ తరువాయి...

బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. వెల్గటూర్ నుండి రాజక్కపల్లె వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు. అదే విధంగా వెల్గటూర్ లో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పర్యాటకులను ఆకర్షించే విధంగా బోటింగ్ సౌకర్యం కల్పించాలని మంత్రి సూచించారు. కోటిలింగాల నుండి పాసిగాం వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ కాలంలో ఆగమేఘాల మీద పనులు ప్రారంభించి నాణ్యతకు త్రిలోధకాలు ఇచ్చారని మంత్రి అన్నారు. పుష్కరాల సమయంలో పనులు నడవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తుల ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఏడాది ముందే పనులు ప్రారంభించి 2027 మార్చి వరకు పుష్కరాల పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, వెలగటూర్ మాజీ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గండ్ర శ్రీకాంత్ రావు ఆలయ కమిటీ చైర్మన్ మేరు నరేష్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుమ్ముల వెంకటేష్, ఎనగందుల నరేష్, గండ్ర ప్రతాప్ రావు, నక్క సురేష్, గుమ్ముల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల

# భవిష్యత్‌కు భరోసా

మొదటి పేజీ తరువాయి...

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు.

జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్టె విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు.తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశం లోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్-అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం, పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశం ఇప్పటికీ వంటనూనెలు, పప్పుధాన్యాలు, కూరగాయల కోసం విదేశాలపై ఆధార పడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగ పనిచేస్తున్నామని చెప్పారు.

ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు.పురుగుమందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా మాత్రమే ప్రపంచ మార్కెట్లలో పోటీ పడగలమన్నారు. రైతులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు,ఖమ్మం జిల్లా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు.ఇందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు.జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది రైతులు వరి కొయ్యలు, మొక్కజొన్న పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పక్కనే ఉన్న పంటలు, తోటలకు నష్టం వాటిల్లడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించిందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### విమాన ఇంధన ధరల స్థిరత్వానికి

# రూ.10 వేల కోట్ల ఇంధన నిధి

మొదటి పేజీ తరువాయి...

ఇంధనాన్ని సరఫరా చేయడానికి వీలవుతుంది. ఈ ఇంధన నిధి కోసం ఓ ప్రత్యేకమైన రికవరీ విధానాన్ని రూపొందించారు. అంతర్జాతీయ మార్కెట్లో విమాన ఇంధన ధరలు తగ్గినప్పుడు ఆ మొత్తాన్ని చమురు సంస్థల నుంచి ప్రభుత్వం తిరిగి వసూలు చేస్తుంది. ఆ సొమ్మును 'కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా' కు జమ చేస్తారు. ఇలా నిధులు పూర్తిగా వసూలయ్యే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విమాన ఇంధనం ధర 2026 మార్చిలో లీటరు రూ.60.50 ఉండగా.. మే నాటికి ఏకంగా రూ.142 కు పెరిగింది. విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ ఖర్చులలో ఇంధనానికే 40 నుంచి 60 శాతం వరకు ఖర్చవుతుంది. పాకిస్థాన్ గగనతలం మూతపడటంతో విమానాలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఈ కొత్త నిధివల్ల ఇంధన ధరలు అదుపులో ఉండి ప్రయాణికులపై టికెట్ ధరల భారం పడకుండా ఉంటుంది. ఈ పథకం కింద విమానయాన సంస్థలు, చమురు సంస్థల మధ్య ఓ అవగాహన ఒప్పందం కుదురుతుంది. దీని ప్రకారం విమానయాన సంస్థలు రాబోయే 36 నెలలపాటు కేవలం ఈ చమురు సంస్థల నుంచే ఇంధనాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంవల్ల దేశంలోని టైర్-2, టైర్-3 నగరాలకు విమాన సర్వీసులు నిరంతరాయంగా కొనసాగుతాయి. అలాగే విమానయాన రంగంపై ఆధారపడిన లక్షలాది ఉద్యోగాలకు రక్షణ ఉంటుంది.

# మమతా బెనర్జీ కి షాక్..

### స్పీకర్‌కు 58 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేల లేఖ.. రితబ్రతను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని వినతి

పశ్చిమ బెంగాల్ : ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీకి షాక్ తగిలింది. 58 మంది ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేశారు. వారంతా కలిసి ఏకంగా అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన రితబ్రతా బెనర్జీని తమ పార్టీ తరఫున అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని స్పీకర్‌ను కోరారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వీరంతా ప్రత్యేక బస్సుల్లో బెంగాల్ అసెంబ్లీకి చేరుకున్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలకు రితబ్రతా బెనర్జీ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. టీఎంసీలో 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో 58 మంది ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేతగా రితబ్రత పేరు సూచిస్తూ మద్దతు నిలిచారు. ఆయన చెప్పినట్లు పార్టీపై 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తే మమత పార్టీలో 20 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారు. అయితే, ఈ అంశంపై ఇప్పటివరకు మమతా బెనర్జీకానీ, టీఎంసీ అగ్రనాయకత్వం కానీ స్పందించలేదు. మరోవైపు టీఎంసీ అగ్రనేత అభిషేక్ కల్యాణ్ బెనర్జీ తాజాగా ఎక్స్‌లో స్పందించారు. తన పార్టీ తరఫున అసెంబ్లీలో హోదాలకు సంబంధించి కీలక ప్రతిపాదనల్ని స్పీకర్‌కు పంపించారు.

ఆయన ప్రకారం.. శోభన్‌దేవ్ ఛట్టోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని కోరారు. కానీ, ఇప్పుడు అత్యధిక శాతం ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు పలకడంతో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. రితబ్రతనే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తే మమత ఆధ్వర్యంలోని టీఎంసీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. ఇటీవలే రితబ్రతతోపాటు సందీపన్ సాహాను కూడా టీఎంసీ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పార్టీ అగ్రనాయకత్వం తమ సంతకాలను ఫోర్జరీ చేసిందని వీరు ఫిర్యాదు చేయడంతో టీఎంసీ వీరిని సస్పెండ్ చేసింది.

## పవన్ ను ఎవరూ అడ్డుకోలేదు..ప్రజలే అడ్డుకున్నారు

మొదటి పేజీ తరువాయి...

ప్రశ్నించినప్పుడు "ఎంత కండలు తిరిగిన పెహల్వాన్ అయినా 3 నెలల్లో పిల్లలు పుట్టించలేడు" అని వ్యాఖ్యానించారు. దీనికి తీవ్ర స్పందన ఇచ్చిన కేటీఆర్ "సరే మరి 30 నెలలైనా పిల్లలు పుట్టకపోతే ఏమనాలి? మిమ్మల్ని ఏమని పిలవాలి? నపుంసకులు అనాలా?" అని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వం రెండున్నరేళ్లలో కనీస ఫలితాలు కూడా ఇవ్వలేకపోవడాన్ని ఎండగట్టారుతెలంగాణను బంగారు పల్లెంలో పెట్టి ఇస్తే సర్వనాశనం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిదని, కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఆ పురోగతి నిలిచిపోయిందని ఆరోపించారు. 30 నెలలుగా ఒక్కటి కూడా గుర్తింపు తెచ్చే పని చేయలేదని విమర్శించారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలమైందని తెలిపారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ నిర్వహించాలనుకున్న సభ వివాదాస్పదమైంది. ఈ సంఘటనపై కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ విభజన సమయంలో పవన్ చూపిన వైఖరి ఇప్పుడు హైదరాబాద్‌లో సభ పెట్టడానికి సరిపోదన్నారు.

గతంలో తెలంగాణ విభజనపై పవన్ తీసుకున్న ధోరణి, ప్రస్తుతం ఆవిర్భావ దినోత్సవం రోజున సభ పెట్టడంపై మండిపడ్డారు. తెలంగాణ 4 కోట్ల భూమిపుత్రుల జాగీర్ అన్నారు. ఉద్యమం ద్వారా సాధించిన విజయాన్ని ఎవరూ తమ రాజకీయ లాభం కోసం ఉపయోగించుకోకూడదని స్పష్టం చేశారు. కేటీఆర్ ఈ వివాదం ద్వారా తెలంగాణ గర్వాన్ని మళ్లీ రేకెత్తించి, తమ పార్టీని రీబ్రాండ్ చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు.ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభించిందనడంలో సందేహం లేదు. ఇది కేవలం వ్యక్తిగత విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా, తెలంగాణ గతం, వర్తమానం మరియు భవిష్యత్ మధ్య జరుగుతున్న సంభాషణగా మారింది. రాబోయే రోజుల్లో ఈ అంశం ఎలా మార్పులు తీసుకురాబోతోందనేది ఆసక్తికరంగా ఉంటుంది.తాజా విమర్శల ద్వారా కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లోకి నెట్టారు. తెలంగాణకు తామే బ్రాండ్ అంబాసిడర్లమని చెప్పకనే చెప్పారు. దీంతో ప్రభుత్వం తన 30 నెలల ప్రగతిని స్పష్టమైన గణాంకాలు, ఫలితాలతో నిరూపించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో మరింత ఉద్రిక్తతను సృష్టించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ తనను తాను "తెలంగాణ అభివృద్ధి రక్షకుడు"గా ప్రదర్శించుకోవడానికి ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని చూస్తోంది.పవన్ కు స్మూత్ వార్నింగ్ కొద్దిరోజులుగా ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి , జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చుట్టూ జరుగుతున్న రాజకీయాలను మనమంతా చూస్తూనే ఉన్నాం. అనవసరంగా ఆయన్ని గెలుకుతూ , మేధావుల ముసుగులో కొంతమంది విశ్లేషకులు పుట్టించిన పుకార్ల నుండి ఈ వివాదం మొదలైంది. తర్వాత ఆ ప్రముఖ మేధావి విశ్లేషకుడు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు అధికారిక ప్రకటన చేసి క్షమాపణలు చెప్పడం , అక్కడితో ఆగకుండా సీనియర్ జర్నలిస్టులు అందరూ కలిసి పవన్ కళ్యాణ్ మీద ముప్పేట దాడి చేస్తూ ప్రెస్ మీట్ ని నిర్వహించడం , ఇలాంటి ఉద్రిక్తత పరిస్థితుల మధ్య పవన్ కళ్యాణ్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా , నవ తెలంగాణ నిర్మాణ సభ ని ఏర్పాటు చేయడం , అందుకు ప్రభుత్వం అనుమతించకపోవడం వంటివి పొలిటికల్ హీట్ ని తారా స్థాయికి తీసుకెళ్లేలా చేశాయి.ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా కూడా , పవన్ కళ్యాణ్ జూబ్లీ హిల్స్ లోని తన నివాసంలో ప్రెస్ మీట్ ని ఏర్పాటు చేసి , తెలంగాణ లో తనని అడుగుపెట్టనివ్వం అంటూ ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ మరియు ఇతర పార్టీల నాయకులపై తీవ్రమైన విమర్శలు చేయడం వంటివి తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. అయితే పవన్ కళ్యాణ్ పై కాసేపటి క్రితమే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియా లో పెను దుమారం రేపుతోంది. ఆయన మాట్లాడుతూ 'తెలంగాణ మీరు అయ్యా జాగీరా ? అని పవన్ కళ్యాణ్ గారు అంటున్నారు. మీరు ఒక్క విషయాన్నీ మాత్రం గుర్తుపెట్టుకోవాలి, తెలంగాణ కచ్చితంగా భూమిపుత్రుల జాగీరు. ఈ నేల కోసం కష్టపడినా వారు , ఈ నేల కోసం త్యాగం చేసిన వాళ్ళ నెత్తురుతో తడిచిన నేల ఇది. ముమ్మాటికీ తెలంగాణ , 4 కోట్ల భూమి పుత్రుల జాగీరు' అంటూ చెప్పుకొచ్చాడు కేటీఆర్.ఇంకా ఆయన మాట్లాడుతూ 'మీరు ఇక్కడే ఉన్నారు , మీ కుటుంబాలు ఇక్కడే ఉన్నాయి, వ్యాపారాలు చేసుకుంటున్నారు , అలాగే ఉండండి , ఎవరికీ ఇబ్బంది లేదు , 10 , 12 ఏళ్ళ నుండి చిన్న సమస్య అయినా వచ్చిందా?, మేము ఎలాంటి వాళ్ళమంటే , వైజాగ్ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేటీకరిస్తున్నారు అంటే , వాళ్ళ తరుపున మేము పార్లమెంట్ లో పోరాడాము బీజేపీ తో' అంటూ ఆయన గుర్తు చేసాడు. పవన్ కళ్యాణ్ తెలంగాణ లో పోటీ చేస్తే మాకు ఎలాంటి ఇబ్బంది లేదని, 2023 లో ఆయన పోటీ కూడా చేసారని, కానీ ఇక్కడి రాజకీయాల్లోకి వచ్చేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి మాట్లాడండి అని , మిమ్మల్ని ఎవరూ అడ్డుకోవట్లేదని, మీరే ఊహాజనితమైన ప్రభంజనాలు సృష్టించుకుంటున్నారు అంటూ పవన్ కళ్యాణ్ పై విరుచుకుపడ్డాడు. పవన్ కళ్యాణ్ నుండి ఓజీ అనే సినిమా వచ్చిందని , మాకు తెలంగాణ లో ఇప్పటికే కేసీఆర్ అనే ఓజీ ఉన్నాడని , మరో ఓజీ అవసరం లేదని, మా రాజకీయాల్లో వేలుపెడితే చూస్తూ ఊరుకోము అంటూ కేటీఆర్ హెచ్చరించారు.

# అంబేద్కర్ మనవడిని కలిసిన ఖమ్మం వెలుగుమట్ల బాధితులు



ఖమ్మం జూన్ 03( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం వెలుగుమట్ల భూదాన భూమిలో నివాసముంటున్న పేద ప్రజల ఇల్లులను ప్రభుత్వం కూల్చిన సంగతి తెలిసినదే . బాధితుల పోరాట ఫలితంగా 311మందికి పట్టాలు ఇచ్చి ఇంకా 600 మందికి పట్టాలు ఇవ్వకుండా కాలక్షేపణ చేస్తున్న సందర్భంలో బాధితులు తమ బాధను చెప్పుకునేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనవడైన రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు , బుద్ధిస్ట్ నేషనల్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ , నేషనల్ సమతాదళ్ అధ్యక్షులైన భీమ్రావ్ యశ్వంత్ అంబేద్కర్ ని కలిసి వెలుగుమట్ల సంఘటన మరియు స్థానిక మంత్రులు వ్యవహరించిన తీరును వివరించారు . భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్ ఇంత దుర్మార్గమైన సంఘటనకు చలించి , స్వయంగా నేనే రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దకు వస్తానని వారు వినని ఎడల రాష్ట్రపతిని , ప్రధానమంత్రిని కలిసి న్యాయస్థానాలను కూడా ఆశ్రయించైనా మీకు న్యాయం చేసేంతవరకు మీ తరఫున పోరాడతానని 16వ తారీఖున వెలుగుమట్ల ప్రాంతానికి వచ్చి పరిశీలన చేస్తానని అన్నారు . ఉమ్మడితెలుగు రాష్ట్రాల ఆర్ పి ఐ పార్టీ అధ్యక్షులు మేజర్ చంద్రకాంత్ మాట్లాడుతూ ఆదిపత్య కులాలు చేసిన కుట్ర ఇది కచ్చితంగా మీ భూమిలో మీకు పక్కా ఇల్లు నిర్మించేదాకా దేశస్థాయి ఉద్యమాన్ని చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు . బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పోడకండి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే బాధితులు రెవిన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని , రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ని కలిసి తమ ఆవేదనను చెప్పుకున్నారు . ఇంకా జాప్యం ప్రభుత్వాలు చేయకూడదని తక్షణమే అధికార యంత్రాంగం బాధితులకు పక్కా భవనాలు నిర్మించేందుకు తొందర పడాలి లేకపోతే జరగబోయే ఉద్యమం రేవంత్ రెడ్డి రాజ్యాన్ని కులుస్తుందని స్థానిక మంత్రులను ఖమ్మం ప్రజలు ఓట్లతో బుద్ధి చెబుతారని అన్నారు . వెలుగుమట్లలో సంపూర్ణ వెలుగు వచ్చేంతవరకు మా ఉద్యమం కొనసాగుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో వెలుగుమట్ల నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ కేతవరపు , వీ.కృష్ణారావు , కో కన్వీనర్ వట్టే ఉదయ్ కిరణ్ , కమిటీ సభ్యులు శివరాత్రి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు

## బూరం సంజీవ్ జన్మదిన వేడుకలు





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 3(ప్రజా కులం) టీయూడబ్ల్యూజే (ఐజేయు) ప్రింట్ మీడియా మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బూరం సంజీవ్ పుట్టినరోజు వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అజీమ్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అఫ్రోజ్, పింజరి శివ,జిల్లా కార్యవర్గ సభ్యులు, బాషెట్టి హరీష్,సాజిద్, సమీ, ఈసి మెంబర్లు అహ్మద్, సోహైల్, రఫీ,గంగాధర్, అమ్ముల ప్రవీణ్,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్, అప్పం చిన్నారెడ్డి, బురాం నారాయణ,మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, 20వ,వార్డు కౌన్సిలర్ మసూల ప్రవీణ్, మాజీ పట్టణాధ్యక్షుడు కుతుబొద్దీన్ పాషా, ఏశమేని గణేష్,న్యాయవాది రాంపెల్లి జగన్, గోదూరు టీవీ ఫోక్ ఛానెల్ ఫేం గోపు లలితమ్మ లు పాల్గొన్నారు

## ఘనంగా స్వర్గీయ కొమిరెడ్డి రాములు జయంతి వేడుకలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 3 (ప్రజా కలం) ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన మాజీ ఎమ్మెల్యే, సుప్రీంకోర్టు న్యాయవాది దివంగత కొమిరెడ్డి రాములు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత నాయకుడు కొమిరెడ్డి రాములు ఆశయాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ రైసొద్దీన్, పట్టణ మాజీ అధ్యక్షుడు కుతుబోద్దీన్ పాషా, కౌన్సిలర్లు ఖాజా అజీమోద్దీన్, మహమ్మద్ ముఖీం తదితరులు పాల్గొన్నారు.

## హద్దు రాళ్ల తొలగింపు

- లే - అవుట్ లేకుండా ప్లాట్లు విక్రయిస్తే చర్యలు
- మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 3(ప్రజా కలం)ప్రతినిధి లే – అవుట్ లేకుండా ప్లాట్లు విక్రయిస్తే చర్యలు తప్పవని మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది మెట్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బచ్ పన్ ప్లే స్కూల్ వెనుక గల ఏరియా లో మరియు 6,7 వార్డ్ లలో అనధికారికంగా ప్లాట్లు ఏర్పాటు చేసిన లే – అవుట్ లోని హద్దురాళ్లను జె సి బి సహాయంతో తొలగించారు. అనంతరం కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మెట్ పల్లి మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా ఎలాంటి లే – అవుట్ కానీ ప్లాట్లు ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన లే – అవుట్ ప్లాట్ కొనుగోలు చేసిన మున్సిపాలిటీ నుండి నిర్మాణ అనుమతులు లభించవని, ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించబడవని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు గమనించి మున్సిపల్ ద్వారా అనుమతి పొందిన లే – అవుట్ లో మాత్రమే ప్లాటు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# కొమిరెడ్డి సేవలు మరువలేనివి

- ఏడాదిలోపు రాములు,జ్యోతక్క విగ్రహాలు ఏర్పాటు
- కొమిరెడ్డి రాములు జయంతి వేడుకల్లో మంత్రి అడ్లూరి





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 3 (ప్రజా కలం) న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా కోరుట్ల, మెట్ పల్లి ప్రాంత ప్రజలకు రాములు అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు జయంతి వేడుకలు బుధవారం మెట్ పల్లి లో నిర్వహించగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరాస్థాయిగా నిలిచిపోయే విధంగా కొమిరెడ్డి రాములు, జ్యోతక్క విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున ఏర్పాటుకు సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాములు కుటుంబ సభ్యులు సూచించిన చోట వచ్చే జయంతి లోపు విగ్రహాల ఏర్పాటు ప్రభుత్వ పరంగా చేస్తామని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తో పాటు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ నర్సింగరావు పర్యవేక్షణలో విగ్రహ ఏర్పాట్ల పనులు చేయాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. వచ్చే జయంతిలోపు విగ్రహాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావాలని మంత్రి అడ్లూరి అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్యతో పాటు కోరుట్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మహిళ డిగ్రీ కళాశాలలో పర్యావరణ దినోత్సవ పోటీలు



జగిత్యాల ప్రతినిధి జూన్ 3 (ప్రజా కలం)

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాలలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం విద్యార్థినులకు పర్యావరణ పరిరక్షణపై వివిధ పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి. చంద్రయ్య పాల్గొని మాట్లాడుతూ.. పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఎంతైనా ఉందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పర్యావరణ అనుకూల అలవాట్లను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ఎకో క్లబ్ ఇన్‌చార్జ్ డి. సుజాత ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరించి, పోటీలను నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం వంటి అంశాలపై నిర్వహించిన వివిధ పోటీల్లో కళాశాలకు చెందిన సుమారు 110 మంది విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన నైపుణ్యాలను, సృజనాత్మకతను డా. జి. శ్రీలత, ఎస్. మల్లికార్జున్ లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థినులు చూపిన చొరవను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సత్యం, సునీత, జ్యోత్స్న, యాస్మిన్ సుల్తానా, లక్ష్మణ్, నరేశ్, వెంకటసాయి, వీణ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు త్వరలోనే బహుమతులు అందజేయనున్నట్లు కన్వీనర్ సుజాత తెలిపారు.

## బడిబాటతో విద్యార్థుల నమోదును పెంచాలి

-విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణి





పెద్దపల్లి,జూన్ 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రతి పాఠశాలలో కనీసం 10 శాతం మేర విద్యార్థుల నమోదును పెంచాలని విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణి సూచించారు.బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల విద్యాశాఖ పనితీరును సమీక్షించారు.ఎఫ్ఎల్ఎన్ అకడమిక్ పనితీరు అంశాల్లో పెద్దపల్లి జిల్లా సాధిస్తున్న పురోగతి, జిల్లాలో ఉపాధ్యాయుల పనితీరుపై నిరంతర సమీక్షలు నిర్వహించడం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ద్వారా పాఠశాలల అకడమిక్ పురోగతిని పర్యవేక్షించడం,క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను ప్రత్యేకంగా అభినందించారు.బడిబాట కార్యక్రమాన్ని గ్రామాలు,వార్డుల స్థాయిలో విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థుల నమోదును పెంచాలని యోగితా రాణి సూచించారు. పాఠశాల విద్యతో పాటు ఇంటర్మీడియట్,డిగ్రీ కళాశాలల్లో కూడా ప్రవేశాల పెంపుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహార పథకం,ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ,మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలు ఈ విద్యా సంవత్సరంలో అమలులో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ సదుపాయాలపై తల్లిదండ్రులు,విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.డిగ్రీ కళాశాలల్లో నైపుణ్యాధారిత విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని,విద్యార్థుల్లో ఉద్యోగ అవకాశాలను పెంపొందించే విధంగా కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన కుమారి,డీఈవో శారద,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పర్యావరణ చైతన్యం తేవాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,జూన్ 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా స్వచ్ఛ గావ్,సురక్షిత జలవాయు కార్యక్రమాలను పెద్దపల్లి జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ గావ్,సురక్షిత జలవాయు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జూన్ 5 వరకు నిర్వహించాల్సిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ,స్వచ్ఛత,సుస్థిర జీవనశైలిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాల జిల్లా కలెక్టర్ వివరించారు.గ్రామ పంచాయతీల పరిధిలోని కమ్యూనిటీ ఘన వ్యర్థాల నిర్వహణ ఆస్తుల స్థితిని సందర్శించి,క్షేత్రస్థాయిలో మదింపు చేయడం,సదరు వివరాలను ఎస్బీఎం(జీ) ఐఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం,గ్రామంలోని బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి,వారి జాబితాను తయారు చేయడం,జూన్ 4న అవగాహన కార్యక్రమాలు,మొక్కల పెంపకం, సామాజిక భాగస్వామ్యంతో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం.ఇందులో మిషన్ లైఫ్,ఎస్బీఎం(జీ)2.0 అంశాలపై అవగాహన కల్పించడం,జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం.ఈ సభలో ఎస్ డబ్ల్యూఎం వ్యర్థాల నిర్వహణ,సాధించిన పురోగతిపై చర్చించి, వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడం,మిషన్ లైఫ్ థీమ్ ద్వారా వ్యర్థాల తగ్గింపు,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, నీటి సంరక్షణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని,బిసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి,జిల్లా పంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమిరెడ్డి రాములు జయంతి వేడుకలు



మెట్ పల్లి రూరల్,జూన్ 03:(ప్రజా కలం):మెట్‌పల్లి మండలానికి చెందిన జగ్గాసాగర్ గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ లక్క చిన్నయ్య ఆధ్వర్యంలో మెట్‌పల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత స్వర్గీయ కొమిరెడ్డి రాములు గారి 78వ జయంతి సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మరియు ట్రాక్టరు యాజమాన్య సంఘం సభ్యులకు మరియు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య సహాయ కేంద్రంలో చికిత్స పొందుతున్న వారికి మజ్జిగ ప్యాకెట్ లను మరియు అరటి పండ్లను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఉపాధి కూలి లతో కలిసి కొమిరెడ్డి రాములు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది.జగ్గాసాగర్ గ్రామ ఉపసర్పంచ్ లక్క చిన్నయ్య మాట్లాడుతూ మెట్‌పల్లి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొమిరెడ్డి రాములు గారి సేవలను కొనియాడుతూ వారి జీవనవిధానం నేటి యువకులు రాబోయే రాజకీయ తరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయి పేదల పెన్నదిగా వారి సేవలకు జీవితాంతం మెట్‌పల్లి నియోజకవర్గం రుణపడి ఉంటుంది అన్నారు.

ఈ కార్యక్రమం లో మండల వైద్యాధికారి అల్లాల అంజిత్ రెడ్డి, వైద్య సిబ్బంది మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పుప్పాల గంగాధర్ , గ్రామ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ , ఉప సర్పంచ్ లక్క చిన్నయ్య , వార్డ్ సభ్యులు మహ్మద్ అజాహరొద్దిన్, సుంచికాల సురేష్ , నాయకులు రంగు మహేష్ , గాజవేణి కుమార్ , కోరం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన నూతన డీఆర్వో కె.వై. ప్రసాద్

జగిత్యాల్ ప్రతినిధి జూన్ 3 (ప్రజా కలం)

జగిత్యాల జిల్లా డీఆర్వో (జిల్లా రెవెన్యూ అధికారి)గా ఇటీవల నియమితులైన కె.వై. ప్రసాద్ బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిపాలన, రెవెన్యూ శాఖ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారాలపై పారదర్శకంగా, భాధ్యతాయుతంగా వ్యవహారించాలని జిల్లా అభివృద్ధి, ప్రజలకు సమర్ధవంతమైన సేవలందించడంలో రెవెన్యూ యంత్రాంగం కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.జిల్లా పరిపాలన లక్ష్యాల సాధనకు పూర్తి స్థాయిలో సహకరిస్తూ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని డీఆర్వో కె.వై. ప్రసాద్ తెలిపారు.

## కొత్తపేట గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

-ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ ఆధ్వర్యంలో

-ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి



ఎండపల్లి, జూన్ 03 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం లో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం మండల వ్యవసాయాధికారి కె. మహేష్ ఆధ్వర్యం లో నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా వరికొయ్యలు కాల్చడం వల్ల జరిగే అనర్థాల గురించి రైతులకు వివరించడం జరిగింది. రైతులు వరికొయ్యలు కాల్చకుండ దుక్కిలో ఎస్ ఎస్ పి లేదా వేస్ట్ డీకంపోజర్ వాడడం వల్ల గడ్డి మురిగి పోతుంది అని తెలియ చేయడం జరిగింది. అలాగే ప్రతి రైతు మట్టి పరీక్ష చేసుకోవాలని రైతులకు చెప్పడం జరిగింది. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరడం జరిగింది. వరి వేసే రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్న రకాలను సాగు చేయాలని సూచించడం జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు తక్కువ పడే అవకాశం ఉన్నందున తక్కువ గ్రౌండ్ వాటర్ వున్న రైతులు వరికి బదులుగా ఆరు తడి పంటలు వేసుకోవలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి, ఏ ఈ ఓ కళ్యాడపు మౌనిక, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులను అభినందించిన ఎస్సై

ఇబ్రహీంపట్నం జూన్ 3( ప్రజా కలం ప్రతినిధి)ఇటీవలే జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ ఆధ్వర్యంలో కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్ లో నిర్వహించిన జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన కరాటే విద్యార్థులు వి. హరిప్రీత్, ఏ. హృషికేష్ లను శిక్షకులు ప్రవీణ్ కుమార్ మాస్టర్ సమక్షంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్. ఐ నవీన్ కుమార్ జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ డిప్లోమా ప్రశంసా పత్రాన్ని, మెరిట్ విభాగంలో గెలుపొందిన బంగారు పథకాలను అందజేసి, ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఇలాంటి కరాటే ఆత్మరక్షణ, యుద్ధ విద్యలు అందరూ విద్యార్థి దశ నుండే నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్ కుమార్, ఫోటోగ్రాఫర్ ప్రదీప్, మధు, కరాటే మాస్టర్లు, నవీన్, విశ్వ తేజ, కరాటే విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా కలం
గురువారం, జూన్ 4, 2026

# భారీగా తగ్గిన బంగారం కొనుగోళ్లు

ప్రధాని నరేంద్ర మోదీ కొద్ది రోజుల కిందట విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు కీలక సూచనలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులోనే బంగారం కొనుగోళ్లకు సంబంధించింది ఒకటి ఉంది. భారతీయులు బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు నిలిపివేయాలని.. పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నా కొనబోమని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. అయితే ఈ క్రమంలోనే పసిడి కొనుగోలుదారులు ట్రెండ్ మార్చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించేసింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన, ఆహార ధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70 శాతం మేర పడిపోయింది. బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం 6 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 శాతం నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం కావడం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని 'ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్' వెల్లడించింది. గతేడాది మే నెల చివరి రెండు వారాల్లో 25 టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65 శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ఈ నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితమైంది. ఈ ఏడాది బంగారానికి దూరంగా ఉండాలంటూ ప్రధానమంత్రి మోదీ దేశ ప్రజలకు చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితో పాటు పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నాయి. ప్రస్తుతం ముంబై స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ. 1.57 లక్షలు పలుకుతుండటం గమనార్హం. బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో కొనుగోలుదారులు తమ బడ్జెట్‌కు తగ్గట్టుగా తక్కువ క్యారెట్ ఉన్న లైట్‌వెయిట్ నగల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకొని చేతిలో డబ్బుల కోసం తమ పాత నగలను అమ్మి క్యాష్ చేసుకునేందుకు జనం జువెలరీ షాపుల వద్ద క్యూ కడుతున్నారు. భారతీయులకు బంగారం అంటే విపరీతమైన ఇష్టం ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఎక్కువగా మహిళలు.. పండగలు, పెళ్లిళ్లు సహా ఇతర శుభకార్యాల వేళ బంగారు ఆభరణాల్ని ఎక్కువగా కొనుగోలు చేసి ధరించాలని చూస్తుంటారు. అయితే.. గత కొంత కాలంగా దీనికి డిమాండ్ తగ్గింది. బంగారం ధరలు ఈ కాలంలో విపరీతంగా పెరగడమే ఇందుకు కారణం. గతేడాది గోల్డ్ రేట్లు ఏకంగా 70 శాతానికిపైగా పెరిగాయి. ఇదే సమయంలో ఈ ఏడాది కూడా ఆరంభంలో పెరిగినా.. తర్వాత అమెరికా- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో స్వల్పంగా తగ్గాయి. అయినప్పటికీ మరీ ఎక్కువేం తగ్గలేదు. దీంతో ఇప్పటికీ గరిష్ఠ స్థాయిల్లోనే కొనసాగుతున్నాయి. ఇక భారత ప్రధాని నరేంద్ర మోదీ కొద్ది రోజుల కిందట బంగారం కొనుగోళ్లకు సంబంధించి ఒక కీలక ప్రకటన చేశారు. విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుందని.. దీనిని ఆదా చేసేందుకు బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు నిలిపివేయాలని.. పండగలు, ఇతర శుభకార్యాలు ఉన్నా కూడా పసిడి కొనుగోళ్లను వాయిదా వేయాలని సూచించారు. భారతీయులు.. బంగారానికి సంబంధించి ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతుంది కాబట్టి.. దిగుమతి బిల్లు పెరిగి విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుందని అన్నారు. అయితే మరి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు తర్వాత భారతీయులు.. బంగారం కొనుగోళ్లను తగ్గించారా అంటే.. అలా జరగకున్నా ట్రెండ్ మార్చేశారని తెలుస్తోంది. పసిడి కొనుగోళ్లకు సంబంధించి.. వినియోగదారుల ధోరణిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని తెలుస్తోంది. గతంలో కొత్త ఆభరణాల్ని కొనుగోలు చేసేందుకు పూర్తి మొత్తం డబ్బులు చెల్లించేవారు.. కానీ ఇప్పుడు మాత్రం తమ దగ్గర ఉన్నటువంటి పాత బంగారు ఆభరణాల్ని ఇచ్చి వాటి విలువకు కొంత అదనపు మొత్తం జోడించి.. కొత్త డిజైన్లు ఎంపిక చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా చెప్పాలంటే.. పాత బంగారం ఇచ్చి కొత్త బంగారం తీసుకోవడం అనేది కొత్త విషయం ఏమీ కాకపోయినా.. గతంలో దీనిపై ఎక్కువగా ఆసక్తి చూపించేవారు కాదు. అప్పట్లో బంగారం స్వచ్ఛతను సరిగా అంచనా వేస్తారా? వేయరా? వేరే దుకాణాల్లో కొనుగోలు చేసిన ఆభరణాలకు సరైన ధర ఇస్తారా లేదా? అదనంగా ఛార్జీలు ఏమైనా విధిస్తారా.. ఇలాంటి సందేహాలతో చాలా మంది దీనికి దూరంగా ఉండేవారు. అయితే ఇప్పుడు హాల్ మార్కింగ్ వ్యవస్థ పకడ్బందీగా అమలు చేస్తుండటం, ఆధునిక టెస్టింగ్ పద్ధతులు అందుబాటులోకి రావడంతో చాలా మందిలో ఒకప్పటి భయాలు తగ్గుతున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రస్తుతం బంగారం ధరలు అధిక స్థాయిల్లో ఉన్న నేపథ్యంలో పాత బంగారు ఆభరణాల్ని మార్పిడి చేసుకోవడం అనేది ఆర్థికంగా ప్రయోజనకర నిర్ణయం అని చెబుతున్నారు. ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. భారత్ ఏటా భారీ మొత్తంలో బంగారం దిగుమతి చేసుకుంటుంది కాబట్టి.. పాత ఆభరణాల్ని రీసైక్లింగ్ చేయడం.. మార్పిడి చేసుకోవడం పెరిగితే అప్పుడు కొత్త బంగారం దిగుమతుల అవసరం కూడా కొంత మేర తగ్గుతుంది. దీంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి కూడా తగ్గుతుంది.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు రెట్టింపు ఆదాయం

## - ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్



పెద్దపల్లి,జూన్ 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులు రెట్టింపు ఆదాయం పొందే అవకాశం ఉందని రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం పాలకుర్తి మండలం ఈసాలతక్కలపల్లి గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ సాగు విస్తరణ అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవతో ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు మొదటి విడతగా బోరుబావుల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యానవన శాఖ,వ్యవసాయ శాఖ,భూగర్భ జలాల శాఖ,తిరుమల ఆయిల్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం,మౌలిక సదుపాయాలు,ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్‌పామ్ రైతులకు భవిష్యత్తులో మరింత లాభదాయకమైన పంటగా మారబోతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ. 23,852 ఉందని,2022లో సాగు ప్రారంభించిన రైతులు ఇప్పటికే దిగుబడులు పొందుతున్నారని తెలిపారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ త్వరలో అందుబాటులోకి వస్తుందని,దీంతో రైతులకు మార్కెటింగ్ పరంగా మరింత సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా మొక్కలు,డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై 90 శాతం,80 శాతం,70 శాతం వరకు సబ్సిడీలు అందిస్తున్నదని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులకు ఉద్యానవన శాఖ తరఫున పూర్తి స్థాయిలో సహకారం అందజేస్తామని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ అధికారిణి జ్యోతి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, తుఫానులు వంటి ప్రతికూల పరిస్థితులను కూడా తట్టుకునే సామర్థ్యం ఈ పంటకు ఉందని వివరించారు. తక్కువ నిర్వహణ వ్యయంతో దీర్ఘకాలిక ఆదాయం అందించే పంటగా ఆయిల్‌పామ్ రైతులకు ప్రయోజనకరమని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని నేలలు,వాతావరణ పరిస్థితులు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. తిరుమల ఆయిల్ కంపెనీ సీఈఓ కేషు కళ్యాణ్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు వేగంగా కొనసాగుతున్నాయని,రైతుల ఉత్పత్తులకు సమీపంలోనే ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి,సర్పంచ్ బండి శ్రీనివాస్, ఉపసర్పంచ్ వడ్నాల జ్యోతి,మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్,వైస్ ఎంపీపీ ఏర్రం స్వామి,భూగర్భ జలాల శాఖ అధికారులు లావణ్య,సుజాత,మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారులు,తిరుమల ఆయిల్ కంపెనీ ప్రతినిధులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానాలలో బడి బాట



రుద్రంగి, జూన్ 03, (ప్రజాకలం ప్రతినిధి)

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా చేపట్టిన బడిబాట కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామ యువత సంఘీభావం ప్రకటిస్తూ గ్రామపంచాయతీకి ప్రత్యేక తీర్మాన పత్రాన్ని అందజేశారు. గ్రామ అభివృద్ధికి విద్యే పునాది అనే నినాదంతో యువకులు ఒక్కతాటిపైకి వచ్చి ప్రభుత్వ బడుల పరిరక్షణకు తమ కట్టుబాటును చాటిచెప్పారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొని ప్రభుత్వ బడి – గ్రామ భవిష్యత్తు అనే సంకల్పంతో తీర్మానాన్ని అధికారికంగా అందజేశారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చేరేలా అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని యువత ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్యా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ.. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర శంకర్, ఉపసర్పంచ్ దాసరి అశోక్ మరియు యువత పాల్గొన్నారు.

# సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

## - వ్యవసాయ అధికారి రాజ్ కుమార్



ఇబ్రహీంపట్నం జూన్ 3( ప్రజా కలం ప్రతినిధి )

రైతులు సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మకపేట్ గ్రామాలలో "ఖేతీ బచావో అభియాన్" కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అని రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు సమీకృత పోషక యాజమాన్యం, నానో యూరియా, నానో డీఏపీ వినియోగం, యూరియా బుకింగ్ యాప్, రైతు రిజిస్ట్రీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే రైతులు సహజ వ్యవసాయ పద్ధతులను క్రమంగా అవలంబించాలని సూచించారు. పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల నేల సారం తగ్గడంతో పాటు పర్యావరణానికి నష్టం కలుగుతుందని, అటువంటి చర్యలకు రూ. 5,000 నుండి రూ. 25,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొమిరెడ్డి రాములు సేవలు చిరస్మరణీయం

## - రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. జువ్వాడి కృష్ణారావు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 3 (ప్రజా కలం) దివంగత మెట్ పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు అన్నారు. మెట్ పల్లి పట్టణంలోని విదిత్ రెడ్డి గార్డెన్స్ లో దివంగత మెట్ పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొని రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ రావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆయన ఎంతో కృషి చేశారని నమ్మిన కార్యకర్తలకు అండగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కొమిరెడ్డి రాములు కుమారులు హైకోర్టు న్యాయవాదులు కొమిరెడ్డి కరంచంద్, కొమిరెడ్డి విజయ ఆజాద్, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ గుంటుక విష్ణు కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొంతం రాజం, నియోజకవర్గం యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ పూదరి నర్సా గౌడ్ షహీద్, మమద్ షేక్ మహ్మద్, గంగస్వామి, మెట్ పల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు పాలెం నీల, న్యాయవాదులు సురభి అశోక్, కమ్యూనిస్టు నాయకులు చిన్న విశ్వనాథం, భాస్కర్, షాహిద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక టీచర్స్ ఆయా పోస్టులకు ఆహ్వానం

గొల్లపల్లి, జూన్ 03 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలో చిల్వాకోడూరు,ఛందోలి, ఇస్రాజ్ పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించనున్న నేపథ్యంలో లో పూర్వ ప్రాథమిక టీచర్ల ఆయాల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి చెరుకు రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి రాత పరీక్ష లేకుండా, ఇంటర్మీడియట్/టెన్త్ అర్హతలతో, స్థానిక, ఆసక్తి ఉన్న మహిళల అభ్యర్థులు ఈ నెల 3 తేదీ నుండి 6 వ తేదీ వరకు ఉదయం నుండి సాయంత్రం 5 వరకు ఎంఈ ఓ కార్యాలయం లో దరఖాస్తులు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టుకు ఇంటర్ మీడియట్, ప్రి ప్రైమరీ ట్రైనింగ్ సర్టిఫికేట్, ఆయా పోస్టుకు 7 వ తరగతి పాసైన సర్టిఫికెట్ ఉన్నవాళ్ళు అర్హులనీ టీచర్ పోస్టుకు 8 వేల వేతనం ఆయాకు 6 వేల వేతనం చెల్లిస్తామని తెలిపారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని, అవసరమైన విద్యార్హతలు ధృవపత్రాలు జత చేసి దరఖాస్తు సమర్పించాలని విద్యాధికారి సూచించారు.

# సాంకేతిక నిఘాతోనే నేరాల నియంత్రణ సాధ్యం



## - రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి,జూన్ 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణే ధ్యేయంగా సాంకేతిక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. బుధవారం పెద్దపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో,పట్టణ వ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేసిన 65 సీసీ కెమెరాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్ఐలు లక్ష్మణరావు,నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంతో గతంలో ఉన్న 70 కెమెరాలకు అదనంగా ఇవి తోడై,పట్టణమంతా నిఘా నీడలోకి వచ్చింది. ఈ సందర్భంగా రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రజలు,ప్రజాప్రతినిధుల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు చొరవతో ఒకేసారి నాలుగు పోలీస్ స్టేషన్లు మంజూరయ్యాయని,దీనివల్ల ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువయ్యాయని కొనియాడారు. ముఖ్యంగా జిల్లాలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు సానుకూల ఫలితాలనిచ్చిందని,కౌన్సెలింగ్ ద్వారా భార్యాభర్తల వివాదాలను పరిష్కరిస్తూ కుటుంబ వ్యవస్థను బలోపేతం చేస్తుండటంతో గతంతో పోలిస్తే మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయని వెల్లడించారు. దొంగతనాలు,రోడ్డు ప్రమాదాలు,ట్రాఫిక్ సమస్యల నివారణకు,ఇతర రాష్ట్రాల నేరస్థుల కదలికలను కనిపెట్టడానికి సీసీ కెమెరాలు కీలకమని, ప్రతి వ్యాపార సంస్థ,నివాస ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసుకోవాలని,దీనికి పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని సీపీ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాలకు, కొత్త కాలనీలకు కూడా ఈ నెట్‌వర్క్‌ను విస్తరిస్తామని చెప్పారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల చెంతకు పోలీస్ సేవలు ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయ రమణారావు**

,సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో రామగుండం కమిషనరేట్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రశంసించారు. పట్టణంలోకి వచ్చే,పోయే వారిని నిరంతరం పర్యవేక్షించేలా పోలీస్ స్టేషన్‌లో ఆధునిక కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నామని, క్షేత్రస్థాయి సిబ్బంది నుండి కమిషనర్ వరకు పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ జి. కృష్ణ,మున్సిపల్ చైర్మన్,నూగిళ్ల మల్లయ్య మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్ఐలు లక్ష్మణరావు,నరేష్, ప్రజాప్రతినిధులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భాదిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

రుద్రంగి, జూన్ 02, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల జర్నలిస్టు సుడిగెపు పర్శరాములు తండ్రి భూమయ్య రెండు రోజుల క్రితం గుండెపోటు తో మరణించగా, అలాగే మార్కెట్ కమిటి చెర్మెన్ చెలుకల తిరుపతి తల్లి బుచ్చవ్వ గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఇరువురి భాదిత కుటుంబాలను బుధవారం వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చెల్మెడ వెంట గంగం మహేష్, మంచే రాజేశం, దయ్యాల కమలాకర్, దయ్యాల నారాయణ, దయ్యాల పెద్దులు, కంటే రెడ్డి, ఉప్పులుటి గణేష్, చెప్యాల గణేష్, నర్సయ్య, నాగులపల్లి రవి, మణిదీప్, తిరుపతి, గంగం రాజిరెడ్డి, నారాయణ, లక్ష్మణ్, సత్తయ్య, గంగాధర్ తదితరులు ఉన్నారు.



## జయశంకర్ బడిబాట కార్యక్రమం

### - ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలోతు జ్యోతి ఆధ్వర్యంలో



ఎండపల్లి, జూన్03 : (ప్రజాకలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామ పంచాయతీ పరిధి లో కోడిపుంజులపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలోతు జ్యోతి ఆధ్వర్యం లో బుధవారం రోజున ప్రొఫెసర్ జయశంకర్ బాడీ బాట కార్య క్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలోతు జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు,ఉదయం పూట రాగి జావా, మధ్యాహ్న భోజనం ఉచిత యూని ఫామ్, అనుభవ జ్ఞానులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులచే ప్రత్యేక బోధన నిర్వహించడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయురాలు ఎం జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ బిసగోని శ్రీనివాస్, పాఠశాల మాజీ విద్యా కమిటీ చైర్మన్ లు గుండ గంగయ్య, మూల శ్రీనివాస్, జల్లెల్ల కనకయ్య, జక్కుల కనకయ్య, జక్కుల మల్లేశం, జల్లెల్ల కుమార్, జల్లెల్ల రాజు, జల్లెల్ల సాయికుమార్, గర్వంద తిరుపతి, గర్వంద రాకేష్, దాసరి సంజీవ్, భాషవేణి స్వామి, భాషవేణి సంజీవ్, ఉపాధ్యాయురాలు తాడికొండ అరుణ, అంగన్ వాడి టీచర్ పుష్పలత, ఆయా చీకటి శ్యామల, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిరాలు మాలోతు జ్యోతి తెలిపారు.

## ఎమ్మెల్యే, కలెక్టర్ ను కలిసిన పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటనారాయణ





గద్వాల ప్రతినిధి జూన్ 3 (ప్రజా కలం న్యూస్ ) జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిని వేరువేరుగా బుధవారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి. వెంకట నారాయణ పూల మొక్కను వారికి అందజేశారు. బదిలీపై జోగులాంబ గద్వాల జిల్లాకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జి. వెంకటనారాయణ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ ని ఐ డి ఓ సి నందు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి. వెంకటనారాయణ బదిలీపై జోగులాంబ గద్వాల జిల్లాకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించి పూల మొక్క బహూకరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జి. వెంకటనారాయణ మీరు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా మంచి ప్రగతి సాధించాలని జిల్లాలోని పశు సంపదను పాడి పశువులను పెంపొందించేందుకు కృషి చేయాలని మీకు నా సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇస్తూ గతంలో ధరూరు, ములకలపల్లి లో డాక్టర్ గా పనిచేసినప్పుడు వారి పాత జ్ఞాపకాలను వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గా మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.

## విద్యార్థుల నమోదు 100% ప్రభుత్వ పాఠశాల లోనే జరగాలి - ఎంఈఓ జి.సురేష్




గద్వాల ప్రతినిధి జూన్ 3 (ప్రజా కలం న్యూస్)
మల్దకల్ మండల కేంద్రంలోని స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్‌లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామసభ, ప్రతిజ్ఞ కార్యక్రమం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు కలిసి విద్య యొక్క ప్రాముఖ్యత, పాఠశాలల్లో నాణ్యమైన విద్య, 100 శాతం విద్యార్థుల నమోదు, డ్రాప్‌అవుట్‌ల నివారణ, ప్రభుత్వ పాఠశాలలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో ప్రతి బాలబాలిక ప్రభుత్వ పాఠశాలలో చేరేలా కృషి చేయాలని, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ ప్రజలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంపీపీ ఎస్ మల్దకల్ తో పాటు పాల్వాయి, మద్దెలబండ,బిజ్వారం ల యందు ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు కాబోతున్నాయని ఈ విషయం పైన గ్రామస్థులు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి 100 శాతం ఎన్రోల్మెంట్ జరిగేలా చూడాలని కోరారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, ఐ కె పి సిబ్బంది కో ఆర్డినేటర్లు జయరాజ్, రామకృష్ణ గ్రామ పెద్దలు,అంగన్వాడీ టీచర్లు, , తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు గద్వాల జిల్లా కు సీఎం రేవంత్ రెడ్డి రాక

గద్వాల ప్రతినిధి జూన్ 3 ( ప్రజా కలం న్యూస్) తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 4, 5 తేదీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తారు. జూన్ 4న కోయిల్ సాగర్, జోగులాంబ గద్వాల జిల్లా ప్రియదర్శిని జూరాల, గూడెందొడ్డి, నార్లాపూర్ రిజర్వాయర్లను సందర్శించి, పనుల పురోగతి, భూసేకరణ, పునరావాస ప్రక్రియలపై సమీక్ష నిర్వహిస్తారు. జూన్ 5న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు, సోమశిల, కల్వకుర్తి ఎత్తిపోతల, కుమ్మెర పంప్ హౌస్, ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించి, ఉయ్యాలవాడలో నూతన ఇరిగేషన్ సమీకృత కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

# ఉపాధిహామీ లో పానది రోడ్ల నిర్మాణం చేపట్టండి

- అధికారుల సిబ్బంది నిర్లక్ష్యం సరి కాదు
- నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగాక పోతే ఎలా
- వర్ష కాలం లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు
- సమీక్షా సమావేశం లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



నిర్మల్, జున్ 3(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ఉపాధి హామీ పథకం లో పానది రోడ్ల నిర్మాణం చేపట్టాలని పలు మార్లు చేపినప్పటికి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం సరి కాదని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.. బుధవారం ముధోల్ నియోజకవర్గ కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో అన్ని మండలాల ఉ పాధి హామీ, అధికారులు, సిబ్బంది చే సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా అయన మాట్లాడారు..ప్రతి మండలానికి రోడ్ల నిర్మాణం కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరైన ప్పటికీ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ లు, ఫీల్డ్ అసిస్టెంట్ లు నిర్లక్ష్యం ప్రదర్శించడం సరి కాదన్నారు. కొన్ని మండలా ల్లో గ్రామాల్లో రైతులకు తాను పలు మార్లు వివరించి చెప్పగా రోడ్ల పనులు పూర్తి కావడం జరిగిందని, ఆ పనులు పూర్తి చేయించిన అధికారులను అభిన ందించారు.రెండు సంవత్సరాలనుండి పానాజీ రోడ్ల పై దృష్టి పెడితే కేవలం 25 శాతం పనులు మాత్రమే పూర్తి అయ్యాయని,, కనీసం 15 రోజుల్లో అయినా ఉపాధి హామీ గ్రావెల్ రోడ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామీణ అభివృద్ధి కి ఉపాధి పథకం లో కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తుందని, చెప్పారు.. ఎన్ని పనులు పూర్తి చేశారు, మిగత పనులు సంగతేంటి సమగ్ర నివేదిక ను తనకు ఇవ్వాల్సిందింగా సూచించారు.. సమావేశం లో డి. ఆర్. డి. ఎ. పి. డి. విజయలక్ష్మి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు..

## ఏం మొహం పెట్టుకొని గద్వాల పర్యటనకు వస్తున్నావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### - బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు - మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్



గద్వాల ప్రతినిధి జూన్ 3 (ప్రజా కలం న్యూస్)
గద్వాల నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టుల పరిస్థితిపై సమాధానం చెప్పే గద్వాల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించాలని బాసు హనుమంతు నాయుడు డిమాండ్ చేశారు. గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన గద్వాలలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనపై పార్టీ నాయకులతో కలిసి,మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూర్యాలంపాడు,గట్టు ఎత్తిపోతల పథకం, నెట్టంపాడు ప్రాజెక్టు లు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులు కానీ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక,ప్రాజెక్టులపై ఉన్న మిగతా పెండింగ్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో చేపడుతున్న పర్యటన అభివృద్ధి కోసం అయితే గద్వాల నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టుల పరిస్థితిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చిన్న కాలువలో చెట్ల వెలిసిన తొలగించని స్థితిలో ప్రభుత్వము ఉన్నదని విమర్శించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జూరాల,గుడ్డెందొడ్డి ప్రాజెక్టులను సందర్శిస్తున్న సమయంలో గద్వాల నియోజకవర్గానికి సంబంధించి,గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన ప్రాజెక్టులు,కొంత మేరకు పెండింగ్ ఉన్నాయని ఆ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులపై స్పష్టమైన హామీ ఇవ్వకుం డా సీఎం పర్యటన కొనసాగడం సిగ్గుచేటు అని అన్నారు. గద్వాల ప్రజల సాగు,తాగునీటి అవసరాలకు కీలకమైన ప్రాజెక్టుల పనులు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయని, వాటి పూర్తి కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సమయం ఇస్తే,గద్వాల నియోజకవర్గ సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ తరపున వినతి పత్రం అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి, జి.రాఘువేంద్ర రెడ్డి,బీచుపల్లి,పటేల్ జనార్దన్ రెడ్డి,కురువ పల్లయ్య,కౌన్సిలర్లు మోహన్ యాదవ్,చిత్తరి కిరణ్,రామకృష్ణ,రఘు నాయుడు, డ్యామ్ శ్రీను,వెంకటేష్ యాదవ్,మోహన్,వినయ్,చాకలి శ్రీనివాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయం, సాగునీటి నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌లి
- ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి
- పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించాలి
- సాగునీటి లభ్యతపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలి
- వ్యవసాయం, హార్టికల్చర్, ఇరిగేషన్ శాఖలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, జూన్ 03( ప్రజా కలం న్యూస్ )
జిల్లాలో వ్యవసాయం, సాగునీటి నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం ఇరిగేషన్, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, నానో యూరియా ప్లస్ వినియోగంపై రైతుల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. వరి కోతల అనంతరం పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని పేర్కొన్నారు.

గ్రామాల్లో ఎవరైనా పంట అవశేషాలను కాల్చినట్లయితే జరిమానాలు విధించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పొలాల్లో మంటలు పెట్టడం వల్ల అవి అదుపు తప్పి చెట్లు, పక్కనే ఉన్న పంటలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తదితర ఆస్తులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులను పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్, కూరగాయలు, తదితర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు పంట మార్పిడి విధానం, యూరియా వినియోగాన్ని తగ్గించే పద్ధతులపై క్రమం తప్పకుండా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా బోర్‌వెల్ ఆధారంగా సాగు చేసే రైతులు, కాలువలపై ఆధారపడి, బోర్ల ద్వారా సాగు చేసే రైతులు, చివరి ఆయకట్టు రైతులను ముందుగానే గుర్తించాలని సూచించారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో వీరు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాశం ఉన్నందున బోర్‌వెల్ ఆధారంగా వరి సాగు చేయడం రైతులకు లాభసాటిగా ఉ ండదని పేర్కొన్నారు. చివరి ఆయకట్టు ప్రాంతాల రైతులను ప్రత్యేకంగా మ్యాపింగ్ చేసి స్థానిక సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల భాగస్వామ్యంతో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం సాగునీటి సరఫరా, తదితర అంశాలపై ఇరిగేషన్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సాగునీటి లభ్యతపై రైతులకు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.
ఈ సమావేశంలో వ్యవసాయ, హార్టికల్చర్, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## లంబాడి హక్కుల కోసం పోరాటం ఆగదు

### - లంబాడి హక్కుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సమ్మయ్య నాయక్



మల్హర్, జూన్ 03 ప్రజాకలం ప్రతినిధి...
కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నంగారాభేరి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన "చలో కొత్తగూడెం" మహాధర్నా ను భగ్నం చేయడంపై ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బీసీ ఎస్సీ ఎస్టీ భూపాలపల్లి జిల్లా జేఏసీ కో-కన్వీనర్ అజ్మీరా సమ్మయ్య నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాకు వెళ్లకుండా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అమానుషమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, పోలీసులను ఉపయోగించి అణచివేయా లని చూడడం ప్రభుత్వ దుశ్చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వం ఇలాంటి అణచివేత ధోరణిని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. లంబాడి జాతి న్యాయమైన హక్కుల సాధన కోసం తన పోరాటం, ఆరాటం నిరంతరం కొనసాగుతాయని, ఎల్లప్పుడూ కొట్లాడుతూనే ఉంటామని సమ్మయ్య నాయక్ స్పష్టం చేశారు.

## ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయండి

### - ఎంపిడిఓ క్రాంతి కుమార్

మల్హర్, జూన్ 3 ప్రజాకలం ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ క్రాంతి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు మండల స్థాయి అధికారులు హాజరై భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తారని పేర్కొన్నారు. జూన్ న అనగ నేడు గురువారం అడువాలపల్లి, చినతూండ్ల, పెద్దతుండ్ల, తాడిచర్ల జూన్ 6 న మల్లారం, దుబ్బపేట, వల్లంకుంట, ఇప్పలపల్లి జూన్ 8న ఎడ్లపల్లి, కొండంపేట్, కొయ్యూరు, రుద్రారం జూన్ 10న అన్సన్‌పల్లి, మల్లంపల్లి, నాచారం లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై, ఈ ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపిడిఓ క్రాంతి కుమార్ కోరారు.

## పంట అవశేషాలు తగల పెట్టొద్దు

### - కూసుమంచి ఏవో రామడుగు వాణి




పాలేరు జూన్ 03( ప్రజా కలం న్యూస్ )కూసుమంచి మండలం పరిధిలోని బుధవారం గోపాలరావుపేట , జీళ్లచెరువు, కేశవాపురం గ్రామాలలో పంట అవశేషాలు తగలబెట్టడం ద్వారా కలిగే అనర్థాలను ప్రచార వాహనం లో ఎల్ఈడి తెర పై వీడియోలను ప్రదర్శిస్తూ మండల వ్యవసాయ అధికారి శ రామడుగు వాణి రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా కలిగే అనర్థాలు వాటిని ఏ విధంగా భూమిలో కలియదున్నాలి అనే అంశంపై రైతులకు వివరించడం జరిగింది. అనంతరం నిషేధిత హాట్ హెచ్ టి పత్తి సాగు, విత్తనాల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలు, విచక్షణా రహితంగా ఎరువులను వాడటం వలన కలిగే అనర్థాలు , నానో ఎరువుల వినియోగం , నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించడం జరిగింది. గ్రామాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కానీ, మరెవరైనా వ్యక్తులు గాని విత్తనాలను అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లయితే వ్యవసాయ శాఖ వారికి వెంటనే సమాచారం అందించాలని తెలియజేశారు . అనంతరం రైతులతో పంట అవశేషాలు ఇకపై తగలబెట్టబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రవీందర్ ,సౌమ్య, ఆ యా గ్రామాల, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో మృతి చెందిన లైన్‌మెన్ కుటుంబానికి రూ. కోటి బీమా సాయం




తానూ ర్, జున్ 03(ప్రజా కలం):
విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎన్పీడీసీఎల్ లైన్‌మెన్ సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్ కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా సాయం అందింది,మృతుడి భార్య స్వప్నకు ఈ బీమా చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ప్రజాభవన్‌లో అందజేశారు. ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు యూనియన్ బ్యాంక్‌తో అమలులో ఉన్న శాలరీ ప్యాకేజీ బీమా పథకం కింద ఈ ప్రయోజనం లభించింది. బాసరలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ప్రమోద్ కుమార్ గత ఏడాది విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా, నామినీగా ఉన్న ఆయన భార్య స్వప్నకు బీమా మొత్తాన్ని మంజూరు చేశారు. ఈ సాయం బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్, యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొని బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం, సంస్థలు కట్టుబడి ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ ను పరామర్శించిన ప్రభుత్వ విప్

రుద్రంగి, (ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిమండల మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి తల్లి బుచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతని కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి లు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్ క్రీస్తు శేషులు చెలుకల గంగ రాజయ్య సతీమణి చేలుకల బుచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించగా అట్టి కుటుంబాన్ని ఈరోజు పరామర్శించడం జరిగిందని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# డీఎస్సీ వార్ - వైసీపీ వర్సెస్ లోకేష్..


విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ-2025 నియామకాల చుట్టూ ఇప్పుడు రాజకీయ యుద్ధం ముదిరింది. వైఎస్సార్‌సీపీ ఈ ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపిస్తుండగా, ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఆరోపణలను తోసిపుచ్చుతూ ఎదురుదాడికి దిగారు. అయితే ఎదురుదాడి కాదని వైసీపీ చేస్తున్న ఆరోపణలకు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. ఏపీలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన మెగా డీఎస్సీ ఒక మెగా స్కామ్ అని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ, మెరిట్ జాబితాలో అక్రమాలు, స్పోర్ట్స్ కోటా కింద పోస్టుల విక్రయం వంటివి జరిగాయని ఆయన వాదిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీఈఆర్టీ లో పనిచేసిన ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి స్టేట్ టాపర్‌గా రావడం వెనుక లోతైన కుట్ర ఉందని, దీనిపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.వైసీపీ ఆరోపణలను ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని జగన్‌కు, తమను విమర్శించే నైతిక హక్కు లేదని లోకేష్ మండిపడ్డారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో ప్రశ్నపత్రం లీకేజీ అనేది సాంకేతికంగా అసాధ్యమని విద్యాశాఖ వివరణ ఇచ్చింది. సుమారు 16,347 పోస్టులను కేవలం 148 రోజుల్లోనే అత్యంత పారదర్శకంగా భర్తీ చేశామని, నియామక ప్రక్రియపై న్యాయస్థానాలు కూడా క్లీన్ చిట్ ఇచ్చాయని మంత్రి గుర్తు చేశారు. వైసీపీ కోరుతున్నట్లుగా సీబీఐ విచారణ జరిపే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేనట్లు తెలుస్తోంది. పైగా, ప్రభుత్వంపై బురద చల్లేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెడతామని విద్యాశాఖ హెచ్చరించింది. అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, మెరిట్ జాబితాలను ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచామని అధికారులు స్పష్టం చేశారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్ , మీడియా సంస్థలకు డెఫమేషన్ నోటీసులు ఇస్తామని కూడా ప్రభుత్వం హెచ్చరించింది. ఈ వివాదం ఇప్పుడు నిరుద్యోగ యువతలో చర్చకు దారితీస్తోంది. వైసీపీ తన ఆరోపణల ద్వారా ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలని చూస్తుంటే, లోకేష్ మాత్రం జాబ్ క్యాలెండర్ అమలు ద్వారా యువతకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్క అక్రమం జరిగిందని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం అని లోకేష్ సవాల్ విసరడం ద్వారా ప్రభుత్వం తన పారదర్శకతపై నమ్మకంగా ఉన్నట్లు కనిపిస్తోంది. చివరగా చెప్పాలంటే, వైసీపీ ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమించాలని చూస్తుంటే.. ప్రభుత్వం మాత్రం రికార్డు స్థాయి సమయంలో నియామకాలు పూర్తి చేశామనే అంశాన్ని తన విజయంగా చెప్పుకుంటోంది. విచారణ సంగతి ఎలా ఉన్నా, ఈ డీఎస్సీ వార్ మాత్రం ఇరు పార్టీల మధ్య యుద్ధాన్ని మరింత వేడెక్కించింది. వైసీపీ బిగ్ ప్లాన్... వస్తే కొండ.. పోతే ఈక.. అన్నట్టు ఆలోచనతో ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. మెగా డీఎస్సీ 2025 పై భారీగానే ప్లాన్ చేసింది ఆ పార్టీ. ఏడాది తరువాత అక్రమాలు జరిగాయి అంటూ ఆరోపణలు చేస్తోంది. కేవలం ఆరోపణలకు మాత్రమే పరిమితం అవుతోంది. ఎక్కడ న్యాయపోరాటం చేయడం లేదు. దీని వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్కా స్కెచ్ అర్థం అవుతోంది. కేవలం రాష్ట్రంలో లక్షలాది ఓట్లను టార్గెట్ చేసుకునే ఈ కొత్త ప్రచారానికి తెర తీసింది. పోతే వేల ఓట్లు.. వస్తే లక్షల కోట్లు అన్నట్టు ఆలోచన చేసింది. గట్టిగానే ప్రణాళిక వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తోంది. సాక్షి మీడియాలో వ్యతిరేక కథనాలు వడ్డిస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఒక్క ఉపాధ్యాయ పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. కనీసం అటువంటి ఆలోచన చేయలేదు. అధికారంలోకి వస్తే ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చారు జగన్. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ శిక్షణ పొందిన లక్షలాదిమంది ఆశగా ఎదురు చూశారు. కానీ వారికి అవకాశం ఇవ్వలేదు జగన్. 2024 ఎన్నికలకు నెల రోజుల ముందు 6100 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో డీఎస్సీ రద్దయింది. దీంతో లక్షలాదిమందికి ఎదురుచూపులు మిగిలిపోయాయికూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్ పై సంతకం చేశారు సీఎం చంద్రబాబు. నారా లోకేష్ నేతృత్వంలో డీఎస్సీ నియామక ప్రక్రియ గడువులోగా పూర్తి చేయగలిగారు. గత ఏడాది ఉపాధ్యాయులను నియమించారు. అయితే కూటమికి అదో ప్లస్ పాయింట్ గా మారింది. ఉపాధ్యాయ వర్గాల్లో కూడా సంతృప్తి కనిపిస్తోంది. అయితే ఇది అంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించలేదు. అందుకే కొత్త ప్రణాళిక వేసింది. డీఎస్సీలో అక్రమాలు జరిగాయి అంటూ జగన్మోహన్ రెడ్డి ఆరోపణలు చేయడం ప్రారంభించారు. ఏదైనా నియామక ప్రక్రియ పై ఆరోపణలు వస్తే వెంటనే కోర్టుకు వెళ్లాలి. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అలా చేయలేదు. ఎందుకంటే డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదు. ఆ విషయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తెలుసు. బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేయడం కంటే దీనిని రాజకీయం చేయడానికి ఎక్కువగా వాడుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.దాదాపు ఆరు లక్షల మంది డిఎస్సీ పరీక్ష రాశారు. అందులో 16 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. కానీ అభ్యర్థుల్లో ఒక రకమైన గందరగోళం సృష్టించాలన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన. పోతే 16,000 ఓట్లు.. వస్తే లక్షల ఓట్లు అన్నది ఆ పార్టీ ఆలోచన. ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగానికైనా రిజర్వేషన్లు అమలు చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తెలుసు. కుల రిజర్వేషన్లతో పాటు దివ్యాంగులకు కొన్ని పోస్టులు కేటాయించాలి. ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా అలానే చేసింది. నిన్ననే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ పూర్తి క్లారిటీ ఇచ్చారు. సుదీర్ఘ వివరణ ఇచ్చారు. సాక్షి మీడియాలో డీఎస్సీ అక్రమాలంటూ వచ్చిన కేస్ స్టడీ పై కూడా స్పష్టతనిచ్చారు. అయితే ఇదంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలియనిది కాదు. డీఎస్సీ పై బురద జల్లి ప్రభుత్వానికి క్రెడిట్ రాకుండా చేయాలి. డీఎస్సీలో ఉద్యోగం రాని వారికి అనుమానం పెంచి వారిని తమ వైపునకు తిప్పుకోవాలి. అంతకుమించి ఏమీ కనిపించడం లేదు కూడా ఇందులో.

# నాగబాబా... లింగమనేని

విజయవాడ : ఏపీలో రాజ్యసభ స్థానాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చేసింది. నాలుగు స్థానాలకు ఎన్నిక జరగబోతుంది. ఇవన్నీ కూటమి పార్టీలకు దక్కబోతున్నాయ్. ఐతే పొత్తులో భాగంగా వీటిలో ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో ఇప్పుడు ఆసక్తికర చర్చ మొదలైంది. జనసేన తరఫున మొదటిసారిగా రాజ్యసభలో అడుగు పెట్టబోయేది ఎవరు.. అవకాశం ఎవరికి దక్కబోతోందనే చర్చ పార్టీలో జరుగుతోంది. జనసేనకు ఇది మొట్టమొదటి స్థానం కావడంతో.. పెద్దల సభకు పవన్ ఎవరిని పంపిస్తారు.. ఎలాంటి సమీకరణాలు లెక్కలోకి తీసుకుంటారనే ఆసక్తి పార్టీ వర్గాలతో పాటు పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికర చర్చ కనిపిస్తోంది.రాజ్యసభ స్థానం విషయంలో పవన్ కల్యాణ్ భారీగా కసరత్తు చేస్తున్నారు. ఇక అటు ఈ ఒక్క స్థానం కోసం ఆశావహులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఇక అటు రేసులో కొందరి పేర్లు కీలకంగా వినిపిస్తున్నాయ్. ఆ లిస్టులో మొదటిగా వినిపిస్తున్న పేరు.. లింగమనేని రమేష్. పవన్‌తో పాటు చంద్రబాబు, నాదెండ్ల మనోహర్‌కు ఆయన అత్యంత సన్నిహితులు. పైగా కష్టకాలంలో పార్టీకి అన్ని రకాలుగా అండగా నిలిచారు. ఇవి లింగమనేని రమేష్‌కు కలిసి వచ్చే అంశాలు. జనసేనకు రాజ్యసభ అవకాశం ఎప్పుడు వచ్చినా.. లింగమనేని రమేష్‌కి ఇస్తారనే పార్టీలో దాదాపు అందరూ ఫిక్స్ అయిపోయిన పరిస్థితి. ఇక ఆయన కూడా చాలాకాలంగా ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది. పవన్ కూడా లింగమనేనికే దాదాపు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఇక అటు లింగమనేనితో పాటు.. మరికొందరు కూడా రాజ్యసభ స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. ఇందులో ప్రధానంగా నాగబాబు పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆయన.. ఎంపీగా వెళ్లాలని ఎప్పటినుంచో అనుకుంటున్నారు. గతంలో రాజ్యసభ స్థానాల ఎంపిక విషయంలో నాగబాబు పేరు వచ్చినా అది టీడీపీకి కేటాయించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీగా సరిపెట్టుకున్నారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ స్థానం త్యాగం చేయడం.. మంత్రి పదవి కూడా రాకపోవడంతో.. రాజ్యసభకు వెళ్లాలన్న కోరిక అయినా తీర్చుకోవాలని నాగబాబు అనుకుంటున్నారట. ఆయనకు కానీ రాజ్యసభ స్థానం దక్కితే.. నాగబాబు ఎమ్మెల్సీ స్థానాన్ని బాలినేనికి ఇచ్చే అవకాశాలు ఉన్నాయ్. నిజానికి బాలినేని కూడా చాలాకాలంగా ఎమ్మెల్సీ పదవి కోసం ఎదురుచూస్తున్నారు. నాగబాబును రాజ్యసభ పంపిస్తే ఇద్దరికీ అవకాశం ఇచ్చినట్లు అవుతుందనే చర్చ కూడా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ ఇద్దరితో పాటు.. మరికొందరు పారిశ్రామికవేత్తలు, పార్టీలోనే ఉన్న సీనియర్ నిర్మాత ఎం రత్నం కూడా రాజ్యసభ స్థానం కోసం పవన్ దగ్గర ప్రయత్నాలు చేస్తున్నారట. ఐతే పవన్ మాత్రం.. పార్టీకి చాలా కాలంగా అండదండలు అందిస్తున్న లింగమనేని వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. మరి ఆయన పేరే ఫైనల్ అవుతుందా.. ట్విస్టులు కనిపిస్తాయా.. రాజకీయ సమీకరణాలు మారతాయా అనేది చూడాలి.

# సేనా గళంతో ప్లాన్

ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యువతను రాజకీయాల్లో మరింత చురుకుగా భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు కొత్త తరం ఆలోచనలకు ప్రాధాన్యం కల్పించేందుకు “సేనా గళం” పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. యువత ఆశయాలు, సామాజిక బాధ్యతలు, దేశాభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ వేదికను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్-జీ తరం ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, రాజకీయాల్లో కూడా యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. ఈ కొత్త కమిటీ ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావాలని, రాజ్యాంగ విలువల పరిరక్షణతో పాటు బాధ్యతాయుత రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.నియోజకవర్గాల వారీగా సేనా గళం కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ నాయకత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు యువతకు ఈ కమిటీల్లో ఎక్కువ అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం కూడా ఈ కమిటీల ప్రధాన బాధ్యతగా ఉండనుంది.ఈ వేదికలో సభ్యత్వం పొందే వారికి కులం, మతం, ప్రాంతం వంటి అంశాలతో సంబంధం ఉండదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయాలనే తపన, ప్రజల కోసం పనిచేయాలనే సంకల్పం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. విద్యావంతులు మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో ముందుకు రావాలనుకునే ప్రతి యువకుడికి అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.రాజకీయాల్లో కులపరమైన విభజనలు పెరుగుతున్నాయని, అనేక సందర్భాల్లో వ్యక్తిగత తప్పులను కూడా కులాల పేరుతో సమర్థించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పవన్ కళ్యాణ్ విమర్శించారు. ఇలాంటి ధోరణులకు యువత వ్యతిరేకంగా నిలుస్తోందని, అదే భావజాలాన్ని సేనా గళం ప్రతిబింబిస్తుందని చెప్పారు. వ్యక్తుల చర్యలకు సమాజాన్ని బాధ్యులను చేయడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు.పాత రాజకీయ సంస్కృతులకు భిన్నంగా కొత్త ఆలోచనలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆలోచన కలిగిన వారికి జనసేనలో ప్రత్యేక స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యుదయ భావాలు, దేశభక్తి, సామాజిక చైతన్యం కలిగిన యువతనుఈ కార్యక్రమం ద్వారా ఒకే వేదికపైకి తీసుకురావాలనేది పార్టీ లక్ష్యమని వివరించారు.ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడం,యువత సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు సూచించడం వంటి బాధ్యతలను సేనా గళం కమిటీలు నిర్వర్తించనున్నాయి. యువత ఆకాంక్షలు, ఆశయాలు, అభిప్రాయాలకు ప్రతినిధిగా ఈ వేదిక పనిచేస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. దీంతో జనసేన పార్టీ భవిష్యత్ రాజకీయ వ్యూహాల్లో యువతకు మరింత



కీలక స్థానం దక్కనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**పవన్ తన మార్క్ ను చూపించేందుకు రెడీ**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రూటు మార్చినట్లు కనిపిస్తుంది. కొంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రిగా రెండేళ్లు పదవీ కాలం పూర్తి కావడంతో ఆయనకు పాలనపై కొంత వరకూ పట్టు సంపాదించారు. భవిష్యత్ లో ఏదైనా సమస్య ఎదురైతే కూటమి ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్న జనసేన కూడా రాజకీయంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆయన భావిస్తున్నట్లుంది. అందుకే నేరుగా రంగంలోకి దిగి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం కాకుండా, పనుల్లో ఆలస్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.తాజాగా రాజమండ్రి పర్యటనతో పవన్ కల్యాణ్ కూటమి పార్టీ నేతలకు పవన్ కల్యాణ్ ఈ రకమైన సంకేతాలను బలంగానే పంపగలిగారు. గోదావరి పుష్కరాలు 2027లో జరగనున్నాయి. 2027 జూన్ నెలలో ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కొన్ని మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేసింది.

పుష్కర ఘాట్ల నిర్మాణంతో పాటు భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు, రహదారి మరమ్మతులు వంటివి చేయాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం లైట్ గా తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రం పనులు వేగంగా జరుగుతున్నాయని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. కానీ గ్రౌండ్ లెవెల్లో పనుల పురోగతి ఆశించినంతగా లేదని పవన్ కల్యాణ్ గుర్తించారు.ఏడు వేల కోట్ల రూపాయల విలువైన పనులను ఏడాదిలో ఎలా పూర్తి చేస్తారంటూ పవన్ కల్యాణ్ సూటిగానే అధికారులను ప్రశ్నించారు. హడావిడిగా చివరి నిమిషంలో చేపట్టిన నిర్మాణాలు కూలిపోతే ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డపేరు రాదా? అని అధికారులను నిలదీశారు.

# వాస్తవాలకు దూరంగా నివేదికలు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు ఇస్తున్న క్షేత్ర స్థాయి నివేదికలపై పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై వాస్తవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు ఉంచడం లేదు. చంద్రబాబు జిల్లా పర్యటనల్లోనూ, ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిపే జిల్లా కలెక్టర్ సమావేశంలోనూ నిజాలను దాచిపెట్టి ఆల్ ఫీల్ గుడ్ అంటూ చెబుతుండటంతో దానిని ఆయన నమ్మేస్తున్నారంటున్నారు. గ్రౌండ్ లెవెల్లో ప్రజలు కూటమి సర్కార్ పట్ల తెలియజేస్తున్న అభిప్రాయాన్ని మాత్రం దాచి పెడుతున్నారు.చంద్రబాబు అయినా, జగన్ అయినా అధికారులపై ఆధారపడక తప్పదు. ఐఏఎస్, ఐపీఎస్ లు పాలనపరంగా కీలకం కావడంతో వారిపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే అదే సమయంలో వాస్తవ విషయాలను, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయాలను ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించాలి. ఎమ్మెల్యేల పనితీరును కూడా పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది నుంచి అడిగి తెలుసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు టీడీపీలో ఇప్పటికీ ఉన్నారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర, కళా వెంకట్రావు వంటి వారితో ముఖాముఖి సమావేశమైతే వారు అసలు విషయాలను చెబుతారంటున్నారు.మరొకవైపు జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి తాము క్యాడర్ కు అండగా ఉంటామని చెబుతున్నారు. కానీ అదే సమయంలో వారి నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం లేదు. దీనివల్ల చంద్రబాబుకు తప్పుడు నివేదికలు అందుతున్నాయని సీనియర్ నేతలే వాపోతున్నారు. ముఖ్యమంత్రిగా పాలనలో తలమునకలై ఉండవచ్చు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి వేగంగా తీసుకెళుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అంత బాగా లేదని, సంక్షేమ పథకాలు కొందరు అర్హులకు కూడా అందకపోవడాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు తన పాలనలో ఏం జరుగుతుందన్న విషయాన్ని నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# రాపాక, ఆమంచి దారెటు...

రాజమండ్రి : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పార్టీలు మారడం కొత్త విషయం కాదు. పరిస్థితులకు అనుగుణంగా నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకుంటూ ఉంటారు. అయితే కొందరు నేతల విషయంలో ప్రస్తుతం వారు ఏ పార్టీలో ఉన్నారనే సందేహమే రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు చెందిన ఇద్దరు ప్రముఖ నాయకుల రాజకీయ ప్రయాణం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.రాజోలు నియోజకవర్గానికి చెందిన రాపాక వరప్రసాద్ రాజకీయ ప్రస్థానం గత కొన్నేళ్లుగా అనేక మలుపులు తిరిగింది. 2019 ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసి విజయం సాధించిన ఏకైక అభ్యర్థిగా ఆయన గుర్తింపు పొందారు. ఆ ఎన్నికల్లో జనసేనకు పెద్దగా విజయాలు రాకపోయినా, రాపాక మాత్రం తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. అయితే ఎన్నికల తర్వాత రాజకీయ పరిస్థితులు మారడంతో ఆయన వైసీపీ కి దగ్గరయ్యారు.కాలక్రమేణా వైసీపీతో ఆయన అనుబంధం మరింత బలపడింది. గత ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఆయనకు పార్లమెంట్ టికెట్ కూడా ఇచ్చింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా కూటమిప్రభావం ఎక్కువగా ఉండటంతో ఆయనకు ఆశించిన ఫలితం దక్కలేదు. ఎన్నికల తర్వాత వైసీపీ కూడా అధికారాన్ని కోల్పోవడంతో రాపాక రాజకీయ వైఖరిపై మళ్లీ చర్చ మొదలైంది.కొంతకాలంగా ఆయన తిరిగి జనసేనలో చేరే ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపించింది. ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా పార్టీని వదిలి వెళ్లిన నాయకుల పునరాగమనంపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అయితే రాపాక పేరు నేరుగా ప్రస్తావించకపోయినా, ఒకసారి పార్టీని వీడిన వారిని తిరిగి చేర్చుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తామని సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతం రాపాక వైసీపీకి దూరంగా ఉంటున్నప్పటికీ, భవిష్యత్తులో ఆయన ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకుంటారనే ఆసక్తి కొనసాగుతోంది.ఇక చీరాల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ఆమంచి కృష్ణమోహన్ పరిస్థితి కూడా దాదాపు ఇదే విధంగా ఉంది. ఒకప్పుడు వైసీపీలో కీలక నేతగా ఉన్న ఆయన, తరువాత కాంగ్రెస్ లో చేరి గత ఎన్నికల్లో పోటీ చేశారు.

అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన రాజకీయ కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయి. కాంగ్రెస్ కార్యక్రమాల్లో కూడా పెద్దగా కనిపించకపోవడంతో ఆయన భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు మొదలయ్యాయి. తిరిగి వైసీపీలో చేరే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఆమంచి ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఆయన తదుపరి అడుగు ఏమిటన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర అంశంగా మారింది. రాబోయే ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో ఈ ఇద్దరు నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును ఎలా మలుచుకుంటారన్నది చూడాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం వారు ఏ రాజకీయ శిబిరానికి పూర్తిగా దగ్గరగా ఉన్నారో స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

## గోదావరి జిల్లాలో

# ఇల్లీగల్ దందా

కాకినాడ : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇల్లీగల్ దందా ఊపందుకుంటోందని చెప్పుకుంటున్నారు. కొందరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు బాగా కావాల్సిన వాళ్ళే దగ్గరుండి మరీ వాటిని నడిపిస్తున్నారన్న ఆరోపణలు పెరుగుతున్నాయి. రాజకీయ అండతో కొన్ని ప్రాంతాల్లో బహిరంగంగానే పేకాట శిబిరాలు నాన్ స్టాప్‌గా నడుస్తున్నాయన్నది లోకల్ టాక్. జూదానికి బానిసలైన వాళ్ళు ఇందులో పడి ఇల్లు ఒళ్లు గుల్ల చేసుకుంటుంటే ఈ అక్రమాలకు అండగా ఉన్నవాళ్ళు మాత్రం కోట్లు గడిస్తున్నారన్న మాటలు గట్టిగానే వినిపిస్తున్నాయి జిల్లాలో. కొన్ని నియోజకవర్గాల్లో పేకాట శిబిరాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయని, అధికార పార్టీకి చెందిన కొద్దిమంది కీలక నేతలు, ప్రజాప్రతినిధుల ముఖ్య అనుచరులే వాటిని నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాంటి నియోజకవర్గాలు ప్రస్తుతం పేకాట రాయుళ్లకు సేఫ్ జోన్‌గా మారిపోయాయని అంటున్నారు. స్థానికంగా ఉండే రాజకీయ అండ కారణంగా? పోలీసులు కూడా చూసీచూడనట్టు వదిలేస్తున్నారని, ఒకవేళ రైడ్ అయినా?. ముందస్తు సమాచారం లీకై తప్పించుకోవచ్చన్న నమ్మకంతో ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పేకాట ఆడేవారు ఇక్కడికి తరలివస్తున్నారట. కొన్ని శిబిరాల్లో రోజూ లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. శిబిరం స్థాయిని బట్టి నిర్వాహకులకు కూడా రోజుకు పది వేల రూపాయల దాకా ఆదాయం వస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. శిబిరం పెద్దదైతే.. ఈ మొత్తం మరింత పెరుగుతోందట. ఇక్కడే పోలీసుల పాత్ర మీద కూడా అనుమానాలు పెరుగుతున్నాయి. అసలేమీ పట్టించుకోవడం లేదని ఎవరైనా వేలెత్తి చూపకుండా పోలీసులు కర్ర విరక్కుండా, పాము చావకుండా అన్నట్టు వ్యవహరిస్తున్నారట. అప్పుడప్పుడు పేకాట శిబిరాలపై దాడులు నిర్వహిస్తూ నామ మాత్రపు కేసులు బుక్ చేస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. ముందస్తు లీక్‌లతో పోలీసులు వెళ్ళే టైంకి ముఖ్యమైన వాళ్ళు ఎవ్వరూ ఉండరట. పని జరిగినట్టు కనిపిస్తుంది, అలాగని ఎవ్వరూ ఇరుక్కోరు. ఆ తూతూ మంత్రపు దాడులు కూడా చిన్న చిన్న శిబిరాల మీదేగానీ పెద్దవాళ్ళ జోలికి అస్సలు పోరన్న విమర్శలున్నాయి. శిబిరాల వెనుక ఉన్న కీలక వ్యక్తులపై చర్యల గురించి మాత్రం లోకల్ పోలీసులు అస్సలు ఆలోచించబోరని కూడా అంటున్నారు కొందరు. పైగా కొన్ని ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్లకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో పెద్ద నాయకుల అనుచరులు నిర్వహించే శిబిరాల జోలికి



పోలీసులు వెళ్లరన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే వీటికి సంబంధించి అధికారికంగా ఎక్కడా ఏ చిన్న ఆధారం దొరక్కుండా జాగ్రత్త పడుతుంటారు. ఇటీవల రావులపాలెం ఘటనతో మళ్లీ పేకాట క్లబ్బుల వ్యవహారంపై చర్చలు మొదలయ్యాయి. రావులపాలెం మండలం దేవరపల్లి శివారులో పోలీసులు నిర్వహించిన దాడి స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో కొందరు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసులు పెట్టారు. అయితే ఆ స్థలం అధికార పార్టీకి చెందిన కీలక నేత అనుచరుడిదేనన్న ప్రచారం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. దీంతో అధికార పార్టీలోనే వర్గపోరు బయటపడిందన్న చర్చ మొదలైంది. కేవలం పేకాట ఆడేవారిపై మాత్రమే కాదు? స్థలం ఇచ్చిన వారిపైనా చర్యలు తీసుకోవాలంటూ కొందరు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం ఆసక్తికరంగా మారింది. కానీ టీడీపీలోని అంతర్గత రాజకీయాల కారణంగానే ఆ శిబిరంపై దాడి జరిగిందన్న గుసగుసలు సైతం ఉన్నాయి. పట్టుబడింది ఒక శిబిరమే కానీ ఇంకా అలాంటివి చాలానే ఉన్నాయంటున్నారు స్థానికులు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో పేకాట శిబిరాలు పెరిగిపోయాయన్న ఆందోళన సైతం వ్యక్తం అవుతోంది. కొత్తపేట నియోజకవర్గంలో మండలానికో శిబిరం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట, రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, గోపాలపురం ప్రాంతాల్లో కూడా పేకాట కేంద్రాలు జోరుగా నడుస్తున్నాయన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇక్కడ పేకాట శిబిరాలు స్థానిక నేతలకు ఆదాయ వనరులుగా మారుతున్నాయని చెప్పుకుంటున్నారు. కరోనా సమయంలో కూడా ఇక్కడ బ్రేక్ ఇవ్వలేదు. అప్పుడు కోనసీమలోని ఒక కీలక నేత ఇంటిలో పేకాట ఆడిన అందరికీ కరోనా సోకిన సంగతి గురించి ఇప్పటికీ చెప్పుకుంటుంటారు. పీఠం మీద పార్టీలు మారుతున్నా.. .

# రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

**తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశం**

తిరుపతి : జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల విస్తరణ మరియు పారిశ్రామిక ప్రాంతాల భూసేకరణ పనులను ప్రణాళికాబద్ధంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులుతో కలిసి సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నేషనల్ హైవే పీడీలు, రైల్వే అధికారులు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు, శ్రీసిటీ ప్రతినిధులు మరియు వివిధ మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ వర్చువల్ విధానంలో మాట్లాడి పనుల పురోగతిపై దిశా నిర్దేశం చేశారు.?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైన శ్రీసిటీ ఫేజ్-2, ఎల్జీ ఫేజ్-2, రాయల్ ఎన్‌ఫీల్డ్, స్పేస్ సిటీ, నాయుడుపేట ఫేజ్-2 ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలో ఉన్న అడ్డంకులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. అలాగే, నడికుడి-శ్రీకాళహస్తి, గూడూరు-రేణిగుంట, తిరుపతి-కాట్పడి, అర్కోణం-రేణిగుంట తదితర రైల్వే లైన్ల పనులను, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట-కడప ఆరు లైన్ల రహదారి పనులను వేగవంతం చేయాలన్నారు. సాగరమాల కింద చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో నాణ్యత పాటించాలని, రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ కోర్టు కేసులను పరిష్కరించాలని సూచించారు. తిమ్మాజికండ్రిగ ఎంఐజీ లేఅవుట్, ఎయిర్‌పోర్ట్, ఇస్రో భూ సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. మరోవైపు,రెవెన్యూ సేవలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) ద్వారా అందిన అర్జీలనుమొదటి ప్రాధాన్యతగా తీసుకుని నిర్ణీతకాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు. రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి భూయజమానుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ముఖ్యంగా, 22ఎ నిషేధిత జాబితాలో ఉన్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన వాటిని త్వరితగతిన జాబితా నుండి తొలగించేలా చర్యలు చేపట్టాలని, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హులైన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని ముమ్మరం చేసి, ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ గంగమ్మ జాతర...

**భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు**

ఏర్పేడు: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంమడిబాకగ్రామపంచాయతీ రాజులకండ్రిగ గ్రామంలో శ్రీ గంగ జాతరను అత్యంత వైభవంగా జరుగుతున్నది. గ్రామ దేవత గంగమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి,మొక్కులు చెల్లించుకుంటున్నారు. గ్రామస్థులు మణిరాజు,కడివెళ్ళ మల్లికార్జున్,రామకృష్ణమ రాజు, చెంగముని, శ్రీకాంత్,గుండ్రాజు మురళి రాజు మరియు గ్రామస్తులు జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు ఈ జాతరలో అమ్మవారికి భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన సారె, పసుపు, కుంకుమలు సమర్పించారు. జాతరలో భాగంగా స్థానిక యువకులు, భక్తులు వివిధ రకాల విచిత్ర వేషధారణలు ధరించి అమ్మవారిని ప్రసన్నం చేసుకున్నారు. ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది.

# చీలిక దిశగా తృణమూల్



కోల్ కత్తా : పశ్చిమ బెంగాల్ అధికార పక్షమైన ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ, యువ నేత అభిషేక్ బెనర్జీ లేని కొత్త తృణమూల్ కాంగ్రెస్ ఏర్పాటు కాబోతోందా? అనే ఊహాగానాలు బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాతి సమీకరణలు, అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బద్దలవడంతో పార్టీ నిలువునా చీలిపోయే ప్రమాదంలో పడినట్లు కనిపిస్తోంది. మహారాష్ట్రలో శివసేన పార్టీ చీలిపోయిన తరహాలోనే.. ఇప్పుడు బెంగాల్‌లోనూ మహారాష్ట్ర మోడల్ పునరావృతం కాబోతోందా అనే చర్చ సర్వత్రా నడుస్తోంది. ఈ వివాదానికి ప్రధాన కారణం పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన సిగ్నేచర్ రో. ఈ వ్యవహారంలో పార్టీ అంతర్గత విషయాలను బయటపెట్టి, విజిల్‌బ్లోయర్‌లుగా మారిన ఇద్దరు తృణమూల్ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహాలను పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఈ బహిష్కరణ చర్యతో అసమ్మతి శ్రేణులు ఒక్కసారిగా యాక్టివ్ అయ్యాయి. పార్టీకి చెందిన దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు, కొందరు ఎంపీలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు, వారు ఇప్పటికే ప్రత్యామ్నాయ శ్రేణులతో చర్చలు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది కోల్‌కతాలోని మమతా బెనర్జీ నివాసంలో అత్యవసరంగా ఏర్పాటు చేసిన కీలక సమావేశమే ఈ చీలిక ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. పార్టీకి ఉన్న 80 మంది ఎమ్మెల్యేలలో ఏకంగా 60 మంది ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి గైర్హాజరవడం తృణమూల్ కాంగ్రెస్‌లో కలకలం రేపింది. మరోవైపు సమావేశానికి రాని కొందరు ఎమ్మెల్యేలు సీనియర్ నేత రథిన్ ఘోష్ నివాసంలో భేటీ అయినట్లు సమాచారం. అయితే తాను అనారోగ్యం కారణంగానే దీదీ సమావేశానికి వెళ్లలేదని రథిన్ ఘోష్ సమర్థించుకున్నారు. అదే సమయంలో మరికొందరు ఎమ్మెల్యేలు దక్షిణ కోల్‌కతాలోని గేట్‌వే హోటల్‌లో రహస్యంగా సమావేశమవడం బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ పరిణామాలపై బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ ఫేస్‌బుక్ లైవ్ ద్వారా స్పందిస్తూ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పార్టీలోని ఒక వర్గంతో కలిసి బీజేపీ ఈ కుట్రకు తెరలేపిందని ఆమె ఆరోపించారు. "నలుగురు ఎమ్మెల్యేలు నా దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని తీవ్రంగా భయపెడుతున్నారట. ఒకవేళ కాళీఘాట్ సమావేశానికి హాజరైతే.. ఆయుధాల చట్టం కింద అరెస్ట్ చేస్తామని బెదిరించారట. అసలు ఇది ఎలాంటి ప్రజాస్వామ్యం? రాష్ట్రంలో అణచివేత అన్ని హద్దులు దాటిపోయింది. మా ఎమ్మెల్యేలను, ఎంపీలను ప్రలోభాలతో, బెదిరింపులతో లాక్కోవాలని బీజేపీ చూస్తోంది" అని ఆరోపించారు. తమ పార్టీలోనే ఉంటూ కొంతమంది నాయకులు 'ద్రోహులుగా' మారుతున్నారని, పోలీసు యంత్రాంగాన్ని కూడా ఇందుకు దుర్వినియోగం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. హోటల్‌లో రహస్యంగా సమావేశమైన ఎమ్మెల్యేల తీరుపై తృణమూల్ నేత కునాల్ ఘోష్ తీవ్రంగా మండిపడ్డారు. ఎవరి పేర్లనూ నేరుగా ప్రస్తావించకుండా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఇప్పుడు ఫోన్ కాల్స్ అందుకుంటూ, గేట్‌వే హోటల్‌లో సమావేశాలు పెడుతున్న ఎమ్మెల్యేలందరికీ ఒక్కటే గుర్తు చేస్తున్నా. మనలో ఎవరూ స్వతంత్ర అభ్యర్థులుగా గెలవలేదు. ఒక 70 ఏళ్ల మహిళ రాష్ట్రమంతటా అలుపెరగకుండా తిరుగుతూ కష్టపడితే, ఆమె ముఖాన్ని చూసి ప్రజలు మనకు ఓట్లేసి గెలిపించారు. పార్టీని చీల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న మాట వాస్తవమే. అయితే దీనికి నేను బీజేపీని నిందించను, మనలోని అవకాశవాదులనే బాధ్యులను చేస్తాను. మనుషులన్నాక కనీస నైతికత, మనస్సాక్షి ఉండాలి" అని వ్యాఖ్యానించారు. కాగా ఈ పరిణామాల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్‌లో రేగిన ఈ అసమ్మతి జ్వాలలు ఎటు దారి తీస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

## భక్తుల ఆరోగ్య భద్రతే టీటీడీ ప్రధాన లక్ష్యం

తిరుమల : భక్తుల ఆరోగ్యం, ఆహార భద్రతకు టీటీడీ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని ఎస్వీ మ్యూజియం ఆడిటోరియంలో, టీటీడీ ఆరోగ్య శాఖ, ఈఎఫ్ఎంఎ, నెస్లే ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆహార భద్రత, పరిశుభ్రతలపై మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ తిరుమలకు ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు విచ్చేస్తున్న నేపథ్యంలో వారికి నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం టీటీడీబాధ్యత అని అన్నారు. ఆహార తయారీ, నిల్వ, పంపిణీ ప్రక్రియల్లో పరిశుభ్రత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని సూచించారు. ఇప్పటికే తిరుమలలో ఆహార భద్రత, పరిశుభ్రతపై పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించినప్పటికీ, వాటిని నిరంతరం కొనసాగించేందుకుఇటువంటిశిక్షణా కార్యక్రమాలు ఎంతో అవసరమని చెప్పారు.

# రెండు గ్రహాలపై వజ్రాల వాన!

హైదరాబాద్ : విశ్వంలో మనకు తెలియని వింతలెన్నో ఉన్నాయి. భూమి మీద నీటి వర్షం కురవడం సహజం. కానీ మన సౌర కుటుంబంలోని మంచు గ్రహాలైన నెప్ట్యూన్, యురేనస్‌ల మీద వజ్రాల వర్షం కురుస్తుందని మీకు తెలుసా? ఇది ఏదో సైన్స్ ఫిక్షన్ సినిమా కథ కాదు. శాస్త్రవేత్తలు ప్రయోగపూర్వకంగా నిరూపించిన యథార్థం. ఈ వజ్రాల వాన మనం అనుకున్నదాని కంటే చాలా తక్కువ ఉష్ణోగ్రతలు, పీడనాల వద్దే మొదలవుతుందని తేలింది. అసలు ఈ వజ్రాలు ఎలా ఏర్పడతాయి? అవి ఆగ్రహాల అయస్కాంత క్షేత్రాలను ఎలా మారుస్తున్నాయి?. ఐస్ జెయింట్స్ అని పిలుపుస్తారు. వీటిలో ఘనమైన కోర్ చుట్టూ నీరు, అమ్మోనియం, హైడ్రోకార్బన్లతో కూడిన మందపాటి మంచు పొరలు ఉంటాయి. ఈ గ్రహాల లోపలి భాగంలో పీడనం, ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగతాయి. ఈ తీవ్రమైన పరిస్థితుల్లో, మీథేన్ వంటి హైడ్రోకార్బన్లలోని కార్బన్, హైడ్రోజన్ విడిపోతాయి. ఆ విడిపోయిన కార్బన్ అణువులు తీవ్రమైన పీడనం వల్ల వజ్రాల స్ఫటికాలుగా మారి, వర్షంలా ఆ గ్రహం లోపలి పొరల్లో కురుస్తాయి. దీనినే శాస్త్రవేత్తలు వజ్రాల వాన అంటారు. వజ్రాల వాన కురుస్తుందని శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా ఊహిస్తున్నప్పటికీ, దానిని ప్రయోగశాలలో మొదటిసారిగా 2017లో నేషనల్ యాక్సిలరేటర్ లాబొరేటరీ పరిశోధకులు గమనించారు. అప్పట్లో హై- పవర్ లేజర్‌లను ఉపయోగించి కేవలం కొన్ని నానో సెకన్లపాటు మాత్రమే ఈ పరిస్థితులను సృష్టించగలిగారు. అయితే 2024లో ప్రచురితమైన పరిశోధనలో జర్మనీలోని యూరోపియన్ ఎక్స్ రే ఫ్రీ ఎలక్ట్రాన్ లేజర్ సహాయంతో శాస్త్రవేత్తలు అద్భుతాన్ని సాధించారు. వీరు పాలీస్టెరిన్ అనే ప్లాస్టిక్ పొరను తీసుకొని, దానిని వజ్రాల మధ్య ఉంచి విపరీతమైన పీడనానికి గురి చేశారు. ఆ తర్వాత ఎక్స్‌రే పల్స్ ద్వారా 2200 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి చేశారు. ఈ ప్రయోగంలో వజ్రాలు మనం గతంలో అనుకున్న దాని కంటే తక్కువ లోతులో తక్కువ పీడనం వద్దే ఏర్పడుతున్నాయని గుర్తించారు.

అయస్కాంత క్షేత్రాల రహస్యం...భూమికి ఉండే అయస్కాంత క్షేత్రం చాలా క్రమబద్ధంగా, ఉత్తర, దక్షిణ ధ్రువాల నుంచి విస్తరించి ఉంటుంది. కానీ నెప్ట్యూన్, యురేనస్ గ్రహాల అయస్కాంత క్షేత్రాలు చాలా వింతగా, అసమానంగా ఉంటాయి. ఇవి గ్రహం మధ్యలో కాకుండా ఒక పక్కకు నెట్టివేసినట్టు కనిపిస్తాయి. ఇలా ఎందుకు జరుగుతుందో ఇంత వరకు అంతుచిక్కలేదు. తాజా పరిశోధనల ప్రకారం, ఆకాశం నుంచి వజ్రాలు కిందికి పడుతున్నప్పుడు, అవి తమతోపాటు వాయువులను, మంచును కూడా లాగుతూ కిందకు వెళ్తాయి. ఇది ఆ గ్రహంలోని విద్యుత్ ప్రసరణ చేసే మంచు పొరల్లో ఒకరమైన కదలికను కలిగిస్తుంది. ఈ కదలికలే ఒక డైనమోలాగా పని చేసి ఆగ్రహాలకు వింతైన అయస్కాంత క్షేత్రాలను సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. మన సౌర కుటుంబంలోని గ్రహాల లోపల ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఈ పరిశోధన దోహదపడుతుంది. విశ్వంలో నెప్ట్యూన్ కంటే చిన్నగా ఉండే మినీ- నెప్ట్యూన్స్ అత్యంత సాధారణమైన గ్రహాలు. అక్కడ కూడా ఇలాంటి వజ్రాల వాన కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రయోగశాలలో ప్లాస్టిక్ నుంచి వజ్రాలను తయారు చేసే ఈ పద్ధతిని భవిష్యత్‌లో మెడిసిన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వాణిజ్యం పరంగా వాడుకోవచ్చు.ప్రయోగశాలలో ఇవి నానో మీటర్ల పరిమాణంలో ఏర్పడినప్పటికీ, నెప్ట్యూన్ గ్రహం మీద ఇవి లక్షల క్యారెట్ల బరువు ఉండే పెద్ద వజ్రాలుగా మారే అవకాశం ఉంది.

# బీజేపీలోకి విజయ్ మాజీ భార్య సంగీత..?



చెన్నై : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ దళపతి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ అద్భుత విజయం సాధించింది. మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విజయ్ సీఎం అయ్యారు. ఈ ఎన్నికల్లో ద్రవిడ పార్టీలను ప్రజలు ఓడించారు. ఈ క్రమంలో తాజాగా తమిళ రాజకీయాల్లో కొత్తగా మొదలైన ఒక హాట్ టాపిక్ విజయ్ మాజీ భార్య సంగీతా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని. ఈ ప్రచారం ప్రకారం, విజయ్ రాజకీయ ప్రభావాన్ని బలహీనపరచడానికి బీజేపీ ఈ వ్యూహం చేస్తోందని, పార్టీలోని ఒక ప్రముఖ నటి ఈ ప్రయత్నాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని చెబుతున్నారు. ఇది కేవలం రూమర్ మాత్రమే కావచ్చు, కానీ తమిళనాడు పొలిటికల్ తెరపై ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ రాజకీయ ప్రవేశం తర్వాత కుటుంబ సమస్యలు, విడాకులు వంటి వ్యక్తిగత అంశాలు కూడా రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయివిజయ్ సినిమా నటుడి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన తర్వాత అతని వ్యక్తిగత జీవితం ప్రజల దృష్టికి ఎక్కువగా వచ్చింది. సంగీతతో దాదాపు 27 ఏళ్ల వివాహ బంధం తర్వాత విడాకుల కేసు, అనుకోని ఆరోపణలు రాజకీయ విమర్శలకు దారితీశాయి. విజయ్ కూడా తన సమీప వ్యక్తులను ఉపయోగించి తనను టార్గెట్ చేస్తున్నారని పరోక్షంగా స్పందించారు. ఇలాంటి సమయంలో సంగీతా బీజేపీ వైపు మొగ్గు చూపడం గురించిన రూమర్లు రావడం ఆసక్తికరం. ఇది విజయ్ రాజకీయ వ్యూహాలకు ఎదురుదెబ్బ కావచ్చని భావిస్తున్నారు. విజయ్ టీవీకే ద్వారా తమిళనాడులో కొత్త శక్తిగా ఎదిగాడు. అతని ప్రభావాన్ని చీల్చడానికి కుటుంబ సభ్యులను ఉపయోగించడం ఒక తెలివైన వ్యూహం కావచ్చు. అయితే ఇలాంటి రూమర్లు పబ్లిసిటీని పెంచుతాయి. సంగీతా బీజేపీలో చేరితే అది తమిళ సినిమా?రాజకీయాల మధ్య మరింత సంబంధాన్ని బలపరుస్తుంది. బీజేపీలో ఉన్న ఒక నటి ఈ ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పడం రూమర్‌కు మరింత ఆకర్షణీయతను ఇస్తోంది. ఇప్పటికి ఇది కేవలం రూమర్ మాత్రమే. సంగీత వైపు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. రాజకీయాల్లో వ్యక్తిగత సంబంధాలు తరచుగా ఉపయోగపడతాయి, కానీ అవి ఎలాంటి ఫలితాలిస్తాయో చెప్పడం కష్టం. విజయ్ అభిమానులు ఇలాంటి వార్తలను తీవ్రంగా తీసుకుంటారు, అదే సమయంలో వ్యతిరేకులు దీన్ని ఆయుధంగా మలుచుకోవచ్చు. తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ సినిమా గ్లామర్‌తో ముడిపడి ఉంటాయి కాబట్టి ఇలాంటి డెవలప్‌మెంట్లు పెద్దగా ఆశ్చర్యం కలిగించవు. ఈ రూమర్ తమిళనాడు రాజకీయాల్లో వ్యక్తిగత జీవితాలు ఎంతగా రాజకీయ సాధనాలుగా మారుతున్నాయో చూపిస్తుంది. సంగీతా బీజేపీలో చేరడం నిజమైతే అది పెద్ద ట్విస్ట్ అవుతుంది. ప్రస్తుతం ఇది కేవలం ఊహాగానాలు మాత్రమే. అధికారిక నిర్ధారణ కోసం వేచి చూడాలి. రాజకీయాలు అనేవి అనూహ్యమైనవి. ఈ డెవలప్‌మెంట్ విజయ్ రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో కాలమే చెప్పాలి.

# డాలస్ లో మహాత్మాగాంధీ స్మారక స్థలిని సందర్శించిన కోమటి జయరాం

డాలస్: ఉత్తర అమెరికాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన కోమటి జయరాం... తొలిసారిగా అర్వింగ్ (డాలస్) లోని జాతిపిత మహాత్మా గాంధీ స్మారక స్థలిని సందర్శించారు. ఈ సందర్భంగా పూజ్య బాపూజీకి పుష్పాంజలి ఘటించారు. మహాత్మా గాంధీ మెమోరియల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ప్రసాద్ తోటకూర, గవర్నెన్స్ బోర్డు సభ్యులు అనంత్ మల్లవరపు... జయరాంకు స్వాగతం పలికి జ్ఞాపికతో సత్కరించారు. ప్రముఖ వ్యాపారవేత్త రామ్ గుళ్ళపల్లి, పలువురు ప్రవాస భారతీయులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ.. "పుష్కర కాలం పూర్తి చేసుకుంటున్న ఇక్కడి గాంధీజీ స్మారకస్థలి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా వివిధ పార్టీల రాజకీయ నాయకులు సందర్శించిన ఒక స్ఫూర్తి దాయకమైన యాత్రాస్థలంగా పేర్కొన్నారు. ప్రవాస భారతీయుల ఐక్యతకు ఈ మహాత్మా గాంధీ మెమోరియల్ ఒక నిలువెత్తు నిదర్శనమని, ఈ మహత్కార్యాన్ని సాకారం చెయ్యడంలో విశేష కృషి సల్పిన గాంధీ మెమోరియల్ చైర్మన్ డా. ప్రసాద్ తోటకూర, వారి కార్యవర్గ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా

**ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**

**గోదావరి పుష్కరాల పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష**


అమరావతి : గోదావరి పుష్కరాలు 2027 నిర్వహణపై సచివాలయంలో వివిధ శాఖలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రుల కమిటీతో పాటు వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. 2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును కూడా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సమీక్షలో వెల్లడించారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల నిర్వహణతో పాటు రాజమహేంద్రవరం లాంటి నగరం ఓ మెగాసిటీగా అభివృద్ధి అయ్యేలా పనులు చేపట్టాలని సూచనలు ఇచ్చారు. కేవలం పుష్కరాలకు మాత్రమే పనులు పరిమితం చేయకుండా ప్రస్తుతం కల్పిస్తోన్న మౌలిక వసతులు గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలని అన్నారు. పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల పనులు, రాష్ట్రంలో 212 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోన్న గోదావరి నది. పోలవరం జిల్లా గుండాలలో మొదటి పుష్కర ఘాట్, కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవాలంక,పశ్చిమగోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మాణ ప్రతిపాదనలను అయన సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసారు. ఈసారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9 నుంచి 10 కోట్లమంది భక్తులు వస్తారని అంచనా. పుష్కర ఘాట్లు, రహదారులు, టెంట్లు, మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం పనులు చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించారు. రాజమహేంద్రవరం, నర్సాపురం సహా వివిధ పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పరిధిలో రూ.1,974 కోట్ల వ్యయంతో 1,660 పనులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రూ.1,080 కోట్ల విలువైన 1140 పనులు జరుగుతున్నాయి. ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా. ప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర పొడవైన పుష్కర ఘాట్లు. కొత్తగా నిర్మించే వాటితో కలిపి ఘాట్ల పొడవు 9.9 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ సమీక్షకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, అనిత, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా,

# మామ గారితో కోడలి ఎఫైర్

ఖమ్మం : ఆమె వయస్సు 30.. మామ వయస్సు 55.. బంధాలు, వయస్సు మరిచిన ఆ ఇద్దరు అక్రమ సంబంధం పెట్టుకున్నారు. సభ్య సమాజం చీదరించుకొంటుందని తెలిసినా కామం తలకెక్కిన ఆ ఇద్దరు తరుచూ ఒక్కటవుతున్నారు. ఓ వైపు ఇంట్లో అత్త, కన్న కూతురు ఉన్నా వారి కళ్లు కప్పి అక్రమ సంబంధం కొనసాగిస్తున్నారు.. అయితే మామా కోడళ్లు ఒక్కటిగా ఉన్న వేళ కన్న కూతురు చూడటంతో విషయం బయటకు పొక్కుతుందని భయపడి కూతురినే కడతేర్చారు. చివరకు చేసిన హత్యను కప్పిపుచ్చుకునేందుకు స్కూల్‌లో ఫిట్స్ (మూర్ఛ) వచ్చిందని చెప్పి మాయమాటలు చెప్పినప్పటికీ కన్న తండ్రికి తన కూతురి మరణంపై అనుమానం రావడంతో చివరికి చేసిన పాపం కాస్తా పోలీసు విచారణలో వెల్లడైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.ఖమ్మం జిల్లా బోనకల్ గ్రామానికి పాలెపు హరికృష్ణ, సునీత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరికృష్ణ లారీ నడుపుతూ కుటుంబాన్ని సాకేవాడు. తరుచూ పనిలో బాగంగా బయటకు వెళ్లేవాడు. సునీత తన భర్త తండ్రి నర్సింహా రావుతో శారీరక సంబంధం ఏర్పడింది. సుమారు ఐదారేళ్లుగా వీరి అక్రమ సంబంధం కొనసాగుతుంది. ఇంట్లో నర్సింహారావు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నా వారి కళ్లుకప్పి వీరి అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల తల్లి, తాత ఒకే గదిలో ఉండగా పెద్దకూతురు మహాదేవి గమనించింది. ఈ విషయాన్ని తండ్రికి చెబుతానని చెప్పడంతో సునీత నర్సింహారావులు ఆమెను హతమార్చాలని నిర్ణయించుకున్నారు.

**స్కూల్‌లో ఫిట్స్ వచ్చి చనిపోయినట్లు చిత్రీకరణ..**మహాదేవిని చంపాలని నిర్ణయించుకున్న సునీత, నర్సింహారావులు కాళ్లు, చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి వైరుతో మెడపై చుట్టి చంపేశారు. ఆ తర్వాత తన కూతురు ఫిట్స్‌తో స్కూల్‌లో చనిపోయిందని అందరిని నమ్మించేందుకు ప్రయత్నించారు. అయితే పాప మెడపై గాయాలు ఉండటంతో అనుమానం వచ్చిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మహాదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

# మల్లారెడ్డి సార్ కథ... బుర్రే.. బుర్ర...



హైదరాబాద్ : సంపాదనకు అలవాటు పడ్డ మనిషి ప్రతి దాంట్లో కూడా డబ్బునే చూస్తాడు. పైసా పెట్టుబడి పెడితే ఎంత లాభం వస్తుందో ముందుగానే అంచనా వేస్తాడు.. అటువంటివారు ఎందరో అడుగుపెట్టినా సరే ధనలక్ష్మి పరుగులు తీసుకుంటూ వస్తుంది. ఇటువంటి అదృష్ట జాతకులు కొంతమంది మాత్రమే ఉంటారు. అందులో మన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సార్ మొదటి స్థానంలో ఉంటాడు. పాల వ్యాపారంతో మొదలుపెట్టి.. పూలను అమ్మే స్థాయికి ఎదిగి.. బోర్వెల్ వ్యాపారం స్టార్ట్ చేసి.. ఎన్నో పాఠశాలలు.. కళాశాలలు.. ఇప్పుడు ఏకంగా దేశంలోనే ఏఐ యూనివర్సిటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే మల్లారెడ్డి కథ ఈ కథనంతోనే ముగియదు. ఎన్ని రకాల విమర్శలు ఉన్నా.. మల్లారెడ్డి స్టైయిల్ వేరే విధంగా ఉంటుంది. తన పొలిటికల్ లీడర్ కాకముందు ఒక వ్యాపారి. వ్యాపారిగా విజయం సాధించిన తర్వాత.. తన ఆస్తులను కాపాడుకునేందుకు రాజకీయాల్లోకి వచ్చారు. చాలామంది ఆయన సేవ చేయడానికి వచ్చారు అంటారు గాని.. ఒక వ్యాపారి సమాజ సేవ చేయడం ఈ దేశం ఇంతవరకు చూడలేదు. ఇకముందు చూసే అవకాశం లేదు.తాజాగా మల్లారెడ్డి ప్రొఫెసర్ అవతారం ఎత్తారు.. ఏఐ పాఠాలు చెప్పడం మొదలుపెట్టారు. అందులో ఏం నేర్చుకోవాలి.. ఎలా నేర్చుకోవాలి.. అనుభవాన్ని ఎలా ఉపయోగించుకోవాలి.. ఈ కాలానికి మనల్ని మనం ఎలా మార్చుకోవాలి అనే అంశాల మీద పాఠాలు చెప్పారు. జీవిత సారాన్ని అవపోసన పట్టిన వ్యక్తిగా మల్లారెడ్డి వాస్తవాలను చెప్పుకుంటూ పోయారు.. చాలామంది ఆయన మాటలకు కనెక్ట్ అయ్యారు.. అయితే చివర్లో మల్లారెడ్డి ఒక ట్విస్ట్ ఇచ్చారు. ఇంత చెప్పిన తర్వాత ఏఐ ఎందుకు ఎంచుకోవాలి.. ఏ ఐ ద్వారా ఏం జరుగుతోంది.. భవిష్యత్తులో వచ్చే మార్పుల గురించి స్పష్టంగా చెప్పారు. ఆయన ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నారు కాబట్టి తనకు తానే ఒక బ్రాండ్ గా మారిపోయి ప్రచారం చేసుకుంటున్నారు. గతంలో ఉత్తర ప్రదేశ్ లో యూనివర్సిటీ పెడుతున్నట్టు మల్లారెడ్డి ప్రకటించారు. దానికంటే ముందు హైదరాబాదులో యూనివర్సిటీని ప్రారంభిస్తున్నారు.

# ‘4 రోజుల్లో రూ.4 కోట్ల వసూళ్లు?’

## పోస్టర్లపై అర్జున్ సర్జా అభిప్రాయమేంటి?



యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా చేసిన లేటెస్ట్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ప్రస్తుతం సినిమా విడుదలైన వెంటనే భారీ వసూళ్ల పోస్టర్లు విడుదల చేయడం సాధారణంగా మారిన నేపథ్యంలో.. అలాంటి ప్రమోషన్స్ పై తన అభిప్రాయాన్ని అర్జున్ సర్జా క్లియర్ గా వెల్లడించారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్.. నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. అర్జున్ సర్జా కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన చిత్రం సీతాపయనం. లవ్, ఫ్యామిలీ రిలేషన్స్, ఇండియన్ కల్చర్, సనాతన ధర్మం వంటి ఎలిమెంట్స్ తో రూపొందిన ఆ చిత్రం ఫిబ్రవరి 14వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాతోనే అర్జున్ సర్జా కూతురు ఐశ్వర్య అర్జున్ తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయమయ్యారు. రీసెంట్ గా సినిమా మార్కెటింగ్ విషయంలో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని పంచుకున్నారు అర్జున్ సర్జా. “సీతాపయనం విడుదల సమయంలో ఒక మార్కెటింగ్ ఏజెన్సీ నాలుగు రోజుల్లో రూ.4 కోట్ల వసూళ్లు వచ్చినట్లు పోస్టర్ విడుదల చేద్దామని సూచించింది. నాకు అసలు అంత డబ్బులు రావు. అందుకే ఒప్పుకోలేదు నేను. చల్ రే అంటూ రిజెక్ట్ చేశా” అంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం బాక్సాఫీస్ నెంబర్స్ విషయంలో ఫేక్ ప్రచారం జరుగుతుందనే అభిప్రాయం ఎప్పటికప్పుడు తరచూ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో అర్జున్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. సినిమా వసూళ్ల కంటే ప్రేక్షకుల రెస్పాన్స్ ముఖ్యమని ఆయన భావిస్తున్నట్లు వ్యాఖ్యల ద్వారా క్లారిటీ వచ్చింది. ఇక సీతాపయనంలో కన్నడ నటుడు నిరంజన్ సుధీంద్ర హీరోగా నటించగా, ఐశ్వర్య అర్జున్ సీత పాత్రలో కనిపించింది. అర్జున్ సర్జాతో పాటు ఆయన అల్లుడు ధృవ సర్జా కూడా గెస్ట్ రోల్ లో సందడి చేశారు. ప్రకాష్ రాజ్, సత్యరాజ్, కోవై సరళ, సుమిత్ర, బిత్తిరి సత్తి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ స్వరాలు అందించగా, రచయిత సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. కథ విషయానికి వస్తే, ప్రమాదం నుంచి బయటపడిన సీత తనను రక్షించిన వారికి థ్యాంక్స్ చెప్పేందుకు ప్రయాణం ప్రారంభిస్తుంది. ఆ సమయంలో అభి అనే యువకుడితో పరిచయం ప్రేమగా మారుతుంది. అయితే అతడు దాచిన ఒక నిజం బయటపడిన తర్వాత సీత తీసుకున్న నిర్ణయం చుట్టూ కథ సాగుతుంది. సినిమాలో ఫ్యామిలీ వాల్యూస్, హ్యూమన్ రిలేషన్స్, గోసంరక్షణ, సనాతన ధర్మం వంటి విషయాలకు ఇంపార్టెన్స్ ఇచ్చారు. కానీ కమర్షియల్ ఎలిమెంట్స్ తక్కువగా ఉండటం, కథలో కొత్తదనం లేకపోవడం, స్లో స్క్రీన్‌ప్లే వంటి కారణాలతో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఏదేమైనా సినిమాకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిక్స్ డ్ రెస్పాన్స్ వచ్చింది. అయినా సరే, ఒరిజినల్ కలెక్షన్లకే ఇంపార్టెన్స్ ఇవ్వాలని, ఫేక్ ప్రమోషన్స్ ద్వారా సక్సెస్ చూపించే ప్రయత్నాలు చేయకూడదని అర్జున్ సర్జా ఇన్ డైరెక్ట్ గా చేసిన కామెంట్స్ ఆకట్టుకుంటున్నాయి. అంతే కాదు అప్పుడప్పుడు వస్తున్నట్లు కొందరు భావిస్తున్న ఫేక్ పోస్టర్ల మధ్య ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీస్తున్నాయి.

# బాడీగార్డ్ 4 ఏళ్లుగా సర్వీస్ చేస్తున్నా ఇన్నాళ్టికి గుర్తింపు

## నెట్టింట వైరల్‌గా మారిన కెవిన్!



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ఎక్కడికి వెళ్లినా ఆయన నీడలా ఒక భారీ కాయుడు కనిపిస్తున్నాడు. అతడే చరణ్ పర్సనల్ బాడీగార్డ్ కెవిన్. ప్రస్తుతం పెద్ది సినిమా ప్రమోషన్స్ కోసం చరణ్ ఎక్కడికి వెళ్లినా ఫ్యాన్స్ మీద పడకుండా ఆపేది, రక్షణ కల్పించేది అతడే. అయితే ఈ మధ్య కాలంలో కెవిన్ అద్భుతమైన బాడీ లాంగ్వేజ్ భారీ ఫిజిక్ చూసి మెగా అభిమానులతో పాటు ముఖ్యంగా అమ్మాయిలు సైతం స్టన్ అయిపోతున్నారు. నాలుగు సంవత్సరాలుగా చరణ్ వద్దే సర్వీస్ అందిస్తున్నా.. పెద్ది ఈవెంట్స్ పుణ్యమా అని ఇప్పుడతడికి ఇన్‌స్టంట్‌గా గుర్తింపు, లైమ్‌లైట్‌లో విపరీతమైన ప్రచారం దక్కింది. పశ్చిమ ఆఫ్రికాలోని గాంబియాలో జన్మించిన 27 ఏళ్ల కెవిన్ వృత్తిరీత్యా ప్రొఫెషనల్ ఎమ్ఎమ్ఏ ఫైటర్. ప్రస్తుతం ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో స్థిరపడిన ఇతడికి అంతర్జాతీయ ఫైటింగ్ సర్కిల్స్ లో గొప్ప విజయాల హిస్టరీ ఉంది. ఇంతటి ఘనమైన బ్యాక్‌గ్రౌండ్ ఉన్న బాడీగార్డ్ కావడంతోనే రామ్ చరణ్ ఇతడికి భారీ పారితోషికమే ఇస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్. సెలబ్రిటీలకు రక్షణ కల్పించడంలో బాలీవుడ్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్ ల బాడీగార్డుల కంటే కూడా కెవిన్ ఎంతో బలంగా, ధృఢంగా కనిపిస్తున్నాడని ప్రశంసలు కురుస్తున్నాయి. రామ్ చరణ్ తనకు, తన పిల్లలు, కుటుంబానికి ఒక మంచి అంగరక్షకుడిని నియమించాలనుకుని నాలుగేళ్ల క్రితమే కెవిన్ ని ఎంపిక చేసుకున్నారట. ఈ నాలుగేళ్లుగా అతడు నిరంతరం తన వెంటే ఉంటూ అంగరక్షకుడిగా వ్యవహరిస్తున్నాడని చరణ్ కూడా ధృవీకరించారు. అతడు ఒక ఫైటర్ అనే కోణంలో కాకుండా ఒక మంచి రక్షకుడిగా ఉంటాడనే చరణ్ అతడిని ఎంపిక చేసుకున్నారట. అయితే కెవిన్ ఎంఎంఏ ఫైటర్ కావడంతో రామ్ చరణ్ పేరు ఇప్పుడు హాలీవుడ్ ఫైటింగ్ సర్కిల్స్‌లో కూడా విపరీతంగా ఫేమస్ అయిపోతోంది. పెద్ది సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న ఈ సమయంలో కెవిన్ పేరు కూడా మార్మోగుతోంది. ఇక తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో రామ్ చరణ్ తన బాడీగార్డ్ గురించి చెబుతూ ఒక ఫన్నీ పంచ్ లైన్ వేశారు. నేను అతడిని అస్సలు బయటకు వెళ్లనివ్వడం లేదు.. ఎవరైనా అతనికి ఒక చాక్లెట్ లేదా బిస్కెట్ లంచం ఇచ్చి... నా గురించి విషయాలు కక్కించేస్తారేమోనని భయం అంటూ చరణ్ నవ్వుతూ కామెంట్ చేశారు. ఈ సరదా వ్యాఖ్యలను చూసిన నెటిజన్లు..తమదైన శైలిలో స్పందిస్తున్నారు. చరణ్ నటించిన పెద్ది ఈనెల 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. కెవిన్ శిక్షణలో చెర్రీ ఎంఎంఏ ఫైట్ లో ఎలా రాటుదేలాడో తెరపై వీక్షించాల్సిందే.


# మోస్ట్ అవైటెడ్ ‘హిరణ్యకశ్యప’.. గుణశేఖర్ మొత్తానికి వదిలేశారా?



టాలీవుడ్ సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన హిరణ్యకశ్యప మూవీ ఇక వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. గత కొన్నేళ్లుగా ఆ ప్రాజెక్టుపై రకరకాల వార్తలు వస్తున్నప్పటికీ, దర్శకుడు గుణశేఖర్ చేసిన లేటెస్ట్ కామెంట్స్ తో ఫుల్ క్లారిటీ వచ్చింది. భారీ బడ్జెట్, కరోనా ఎఫెక్ట్, నిర్మాణ సంస్థల పరిస్థితుల కారణంగా ఆ మోస్ట్ అవైటెడ్ మూవీ ప్రాజెక్ట్ ఆగిపోయిందని ఆయన వెల్లడించారు. టాలీవుడ్ లో విజువల్ గ్రాండియర్ చిత్రాలకు పేరుగాంచిన గుణశేఖర్, రానా దగ్గుబాటి లీడ్ రోల్ లో హిరణ్యకశ్యపను తెరకెక్కించాలని చాలా కాలం క్రితమే నిర్ణయించారు. పురాణాల్లో అత్యంత పవర్ ఫుల్ రోల్స్ లో ఒకటైన హిరణ్యకశ్యపుడి స్టోరీ మోడ్రన్ టెక్నాలజీతో ఇంటర్నేషనల్ లెవెల్ లో రూపొందించాలని ప్లాన్ రెడీ చేశారు. ఆ ప్రాజెక్ట్ కోసం ఏకంగా ఏడు సంవత్సరాల టైమ్ స్పెండ్ చేసినట్లు గుణశేఖర్ తెలిపారు. రీసెంట్ గా నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. ఆ సినిమా కోసం మూడు నుంచి నాలుగేళ్ల పాటు ప్రీ ప్రొడక్షన్ పనులు చేసినట్లు చెప్పారు. పాత్రల డిజైన్లు, వరల్డ్ ప్లాన్, విజువల్ కాన్సెప్ట్ వంటి అంశాలపై ప్రత్యేకంగా పని చేశామని వెల్లడించారు. అయితే సినిమాను అనుకున్న స్థాయిలో తెరకెక్కించాలంటే సుమారు రూ.300 కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని అంచనా వచ్చిందన్నారు. మొదట ఆ ప్రాజెక్టుకు ఫాక్స్ స్టార్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపాయని గుణశేఖర్ తెలిపారు. కానీ కరోనా మహమ్మారి తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. ఆ తర్వాత ఫాక్స్ స్టార్ ను డిస్నీ కొనుగోలు చేయడంతో కొత్త యాజమాన్యం ఆ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లడానికి ఆసక్తి చూపలేదన్నారు. అంత భారీ పెట్టుబడి పెట్టడం సాధ్యం కాదని వారు భావించారని వివరించారు. ఇటీవల హిరణ్యకశ్యప సినిమాను త్రివిక్రమ్ తెరకెక్కించబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో జరగ్గా.. దానిపై కూడా గుణశేఖర్ స్పందించారు. ఈ విషయంపై తానే స్వయంగా త్రివిక్రమ్ కు ఫోన్ చేసి మాట్లాడినట్లు చెప్పారు. అప్పుడు త్రివిక్రమ్.. తాను ఆ ప్రాజెక్ట్ లో రచన పరంగా మాత్రమే భాగమయ్యానని, దర్శకత్వం వహించే ఆలోచన లేదని స్పష్టంగా చెప్పారని వెల్లడించారు.


దీంతో ఆ వార్తలకు చెక్ పెట్టారు. హిరణ్యకశ్యప ప్రాజెక్ట్ ఆగిపోవడంపై గుణశేఖర్ కొంత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సినిమా కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడ్డానని, ఆ సమయంలో తాను ఆలోచించిన కొన్ని కాన్సెప్టులు ఇతర సినిమాల్లో కనిపించాయని అన్నారు. పురాణ కథలకు స్పెషల్ రైట్స్ ఉండవని, అందువల్ల ఎవరైనా ఆ కథలను తమదైన శైలిలో తెరకెక్కించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఇటీవల విడుదలైన మహావతార్ నరసింహ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. తాను గతంలో ఊహించినట్లుగానే నరసింహ స్వామి స్టోరీపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఉందని ఆ సినిమా విజయంతో మరోసారి ప్రూవ్ అయిందన్నారు. అయితే హిరణ్యకశ్యప వదిలేసినప్పటికీ, ఆ ఆలోచనల ఆధారంగా కొత్త కథను సిద్ధం చేస్తున్నట్లు గుణశేఖర్ తెలిపారు. ప్రస్తుతం వర్క్ జరుగుతోందని చెప్పారు. దీంతో హిరణ్యకశ్యప కాకపోయినా, గుణశేఖర్ నుంచి మరో భారీ కాన్సెప్ట్ మూవీ వచ్చే అవకాశం కచ్చితంగా ఉందన్నమాట.


# కొత్త లుక్, కొత్త వైబ్.. విక్కీతో కత్రినా పోస్‌కు ఫ్యాన్స్ ఫిదా!



బాలీవుడ్ లవ్లీ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ ఎప్పుడూ సోషల్ మీడియాలో క్రేజీ కపుల్ గోల్స్ ఇస్తూనే ఉంటారు. తాజాగా కత్రినా కైఫ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని క్యూట్ ఫోటోలు ఇప్పుడు నెట్‌లో ఫుల్ వైరల్ అవుతున్నాయి. తన మే నెల ఎంత అందంగా, సింపుల్‌గా సాగిపోయిందో చూపిస్తూ ఆమె పెట్టిన పోస్ట్ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆ ముచ్చటైన విశేషాలు ఏంటో ఇప్పుడు సింపుల్‌గా చూసేద్దాం.. సాధారణంగా సెలబ్రిటీల లైఫ్ అంటే ఎప్పుడూ బిజీగా, హడావిడిగా ఉంటుంది. కానీ కత్రినా మాత్రం తన జీవితంలోని చిన్న చిన్న సంతోషాలను, ప్రత్యేక క్షణాలను ఎంజాయ్ చేయడానికి ఇష్టపడుతుంది. ఇక అందులో భాగంగానే, ముగిసిన మే నెలలో తాను దాచుకున్న కొన్ని బ్యూటిఫుల్ మెమొరీస్, ఫోటోలను ఫ్యాన్స్‌తో పంచుకుంటూ ఒక లాంగ్ క్యాప్షన్ పెట్టింది. ఈ ఫోటోల సిరీస్‌లో కత్రినా తన భర్త విక్కీ కౌశల్‌తో కలిసి ఉన్న క్యూట్ పిక్స్ హైలైట్‌గా నిలిచాయి. ఇక ఇద్దరూ ఎంతో హ్యాపీగా, సింపుల్ లుక్స్‌లో కనిపిస్తూ అభిమానుల మనసులు గెలుచుకున్నారు. ఇక నెటిజన్లు ఈ ఫోటోలు చూసి “బెస్ట్ కపుల్” అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీ ఈ ఫోటోల్లో క్లియర్‌గా కనిపిస్తోంది. కత్రినా షేర్ చేసిన ప్రతి ఫోటో వెనుక ఒక చిన్న స్టోరీ ఉంది. కేవలం ఆడంబరాలకే పరిమితం కాకుండా.. ప్రకృతిని ఆస్వాదించడం, నచ్చిన ఫుడ్ తినడం, కాసేపు ప్రశాంతంగా గడపడం లాంటి ఎన్నో మధురమైన క్షణాలను ఆమె ఈ పోస్ట్‌లో చూపించింది. ఇక ఈ కొత్త వైబ్, ఆమె సింప్లిసిటీ ఫ్యాన్స్‌కు ఒక ఫ్రెష్ ఫీలింగ్‌ను ఇస్తున్నాయి. సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నా, పర్సనల్ లైఫ్‌ను ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలో ఈ జంటను చూసి నేర్చుకోవచ్చు. కత్రినా కైఫ్ షేర్ చేసిన ఈ లేటెస్ట్ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. చిన్న చిన్న విషయాల్లోనే అసలైన ఆనందం దాగి ఉంటుందని కత్రినా పెట్టిన ఈ క్యూట్ పోస్ట్ చూస్తే ఎవరికైనా అర్థమైపోతుంది.

# థియేటర్స్‌లో నిరాశ.. ఓటీటీలో మాత్రం భారీ క్రేజ్!





ఈ మధ్య కాలంలో సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా కొన్ని వారాల్లోనే ఓటీటీలోకి వచ్చేస్తోంది. థియేటర్లలో భారీ ఖర్చుల వల్ల చూడలేకపోయిన ప్రేక్షకులు, ఇప్పుడు ఇంట్లోనే ప్రశాంతంగా ఓటీటీల్లో సినిమాలు చూస్తున్నారు. అందుకే థియేటర్లలో పెద్దగా ఆడకపోయినా, కొన్ని సినిమాలు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో మాత్రం రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి. థియేటర్లలో మిస్ అయి, ఓటీటీలో ట్రెండింగ్‌లో ఉన్న అలాంటి 5 సినిమాల విశేషాలు ఇప్పుడు చూద్దాం!

విష్ణు విన్యాసం: అమెజాన్ ప్రైమ్‌లో టాప్ ట్రెండింగ్: శ్రీవిష్ణు, నయన్ సారిక జంటగా నటించిన సినిమా ‘విష్ణు విన్యాసం’. థియేటర్లలో రిలీజ్ అయినప్పుడు ఈ సినిమాకు యావరేజ్ టాక్ వచ్చింది. కానీ అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి వచ్చాక సీన్ రివర్స్ అయింది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా నచ్చడంతో ప్రస్తుతం ఇది ఓటీటీలో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.

డ్రింకర్ సాయి: జీ5 లో నంబర్ వన్: చిన్న సినిమాగా థియేటర్లలోకి వచ్చిన ‘డ్రింకర్ సాయి’ బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. కానీ జీ5 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చాక ఈ చిత్రానికి ఊహించని రెస్పాన్స్ దక్కింది. యూత్ ఈ సినిమాను బాగా ఆదరించడంతో ఓటీటీలో నంబర్ వన్ ట్రెండింగ్ మూవీగా నిలిచింది.

ఎల్ఐకె : ఓటీటీలో దూసుకుపోతున్న ప్రదీప్ సినిమా: ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విగ్నేష్ శివన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం ‘ఎల్ఐకె’. థియేటర్ ఆడియన్స్‌ను అంతగా ఆకట్టుకోలేకపోయిన ఈ సినిమా, ఓటీటీ ప్రియులను మాత్రం బాగా అలరిస్తోంది. ఇక ప్రస్తుతం ప్రైమ్ వీడియోలో 3వ స్థానంలో ట్రెండ్ అవుతూ మంచి వ్యూస్ రాబడుతోంది.

గాయపడ్డ సింహం: నవ్వులు పూయిస్తున్న తరుణ్ భాస్కర్: తరుణ్ భాస్కర్ నటించిన సరికొత్త ఫన్ ఎంటర్టైనర్ మూవీ ‘గాయపడ్డ సింహం’. థియేటర్లలో పెద్దగా సౌండ్ చేయని ఈ సినిమా, ప్రైమ్ వీడియోలో మాత్రం 5వ స్థానంలో ట్రెండింగ్‌లో ఉంది. ఇంట్లోనే కూర్చుని కాసేపు నవ్వుతూ ఎంజాయ్ చేయాలనుకునే ప్రేక్షకులకు ఇది బెస్ట్ ఛాయిస్‌గా మారింది.

భర్త మహాశయులకు విజ్ఞప్తి : ఇటీవల కాలంలో రవితేజ నటించిన ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’, అలాగే కమల్ హాసన్ నటించిన ‘థగ్ లైఫ్’ చిత్రాలు థియేటర్లలో భారీ అంచనాల మధ్య విడుదలై యావరేజ్ లేదా ఫ్లాప్‌గా మిగిలాయి. కానీ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో రిలీజ్ అయ్యాక మాత్రం వీటికి రికార్డు స్థాయి వ్యూస్ వచ్చాయి. ఇక స్టార్ హీరోల సినిమాలు కావడంతో డిజిటల్‌లో ప్రేక్షకులు ఎగబడి చూస్తున్నారు. డబ్బులు, సమయం ఆదా అవుతుండటం.. నచ్చిన టైమ్‌లో ఫ్యామిలీతో కలిసి ప్రశాంతంగా చూసే అవకాశం ఉండటంతో ఓటీటీల క్రేజ్ రోజురోజుకూ పెరుగుతోంది. థియేటర్లలో నిరాశపరిచిన యాక్షన్, క్రైమ్, ఫన్ సినిమాలు కూడా ఓటీటీలో మంచి టైమ్‌పాస్ ఆప్షన్స్‌గా మారి సక్సెస్ అవుతున్నాయి.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

## ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి వినతి పత్రం అందజేసిన కందుకూరు సిఐటియు మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్

మహేశ్వరం, జూన్ 03,(ప్రజా కలం)

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కందుకూరు సిఐటియు మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వంతో మాట్లాడి మధ్యాహ్న భోజన కార్మికులకు న్యాయం అయ్యేటట్టు చూస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం నెలకు 10000 ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట నిలబెట్ట పొగ ఉదయం పూట విద్యార్థులకు టిఫిన్లు ఏర్పాటు చేసి ప్రవేటు ప్రైవేటు




సంస్థ అయినా హరి రామ ట్రస్ట్ వాళ్లకు అప్పచెబుతున్నారని అన్నారు. ఇది సరైన పద్ధతి కాదు. మధ్యాహ్న భోజన కార్మికులు గత 20 ఏళ్ల నుండి పనిచేస్తున్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు అప్పచెప్పాలని వారి డిమాండ్ చేశారు. అలాగని మధ్యాహ్నం భోజనం పథకం అక్షయపాత్ర వాళ్లకి ఇవ్వాలని ఆలోచన చేస్తున్న ప్రభుత్వం యధావిధిగా మధ్యాహ్నం భోజన కార్మికులే ఉండేటట్టు చూడాలని వారు అన్నారు . గృహలక్ష్మి పథకం కింద స్కూలు పేరు మీద గ్యాస్ సిలిండర్లు సబ్సిడీ ప్రభుత్వం ఇవ్వాలని వారు అన్నారు అలాగని. నెలకు 3000 గౌరవేతను ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి పది నెలలే ఇచ్చి రెండు నెలల జీతం ఇస్తలేరని అన్నారు. .ఇచ్చే గౌరవేతనం చాలీచాలని జీతం మొత్తం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ లక్ష రూపాయలు ఇవ్వాలని బిల్లులు ప్రతినెల 1వ తారీఖున ఇవ్వాలని హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వాలని అన్నారు. 58 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్లు 3000 ఇవ్వాలని.. గుర్తింపు కార్డులు ఇవ్వాలని. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని. వారికి ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు కి ప్రభావతి అండాలు గీత చంద్రకళ వెంకటమ్మ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# మానవతాశిఖరం హరీషన్న

## జన్మదిన వేడుకల్లో మానవీయతకు పెద్దపీట కుటుంబ పెద్దలను కోల్పోయిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు రూ. లక్ష చొప్పున ఆర్థిక భరోసా

గజ్వేల్:03 జూన్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్: మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మానవీయ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కుటుంబ పెద్దలను కోల్పోయిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ హరీష్‌రావు సేవా స్ఫూర్తిని చాటారు. గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఇతర మిత్రుల సహకారంతో ఎమ్మెల్సీ వంటేరు యాదవ్‌రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ఇటీవల మరణించిన నలుగురు బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున పోస్టాఫీస్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేశారు. కోమటిబండ గ్రామానికి చెందిన శేకు భాస్కర్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ మర్రికింది సుమన్, ములుగు మాజీ ఎంపీటీసీ బొడ్డు ప్రవీణ్,కాశిరెడ్డిపల్లి గ్రామ సీనియర్ నాయకుడు బండారి ఎల్లయ్య కుటుంబాలకు ఈ సహాయం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ఆపదలో ఉన్నవారికి వెంటనే అండగా నిలిచే గొప్ప మానవతావాది హరీష్‌రావు అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. పేద ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న హరీష్‌రావుకు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని,ఆయన మరింత ఆరోగ్యంతో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. కేసీఆర్ నాయకత్వంలో హరీష్‌రావు మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరమ్ మాజీ అధ్యక్షుడు దేవి రవీందర్,మున్సిపల్ చైర్పర్సన్ గంగిశెట్టి చందన రవిందర్,వైస్ చైర్మన్ పద్మబాయ్ నర్సింగ రావు, మర్కుక్ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి,టౌన్ ప్రెసిడెంట్ నవాజ్ మీరా,బెండే మధు,కొండపాక్ మండల అధ్యక్షుడు నూనె కుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి,మాజీ ఎంపీపీ పాండు గౌడ్,మాజీ జడ్పీటీసీ మల్లేశం,నాయకులు చంద్రమోహన్ రెడ్డి,రవీందర్ రావ్,మద్దూరి శ్రీనివాస్ రెడ్డి,యాదవ రెడ్డి,ఊడేం కృష్ణా రెడ్డి,ఉపేందర్ రెడ్డి,గుండా రంగారెడ్డి,మాజీ జడ్పీటీసీ రాంచంద్రం,కవిత, బాల్ రెడ్డి,మద్ది రాజిరెడ్డి,జే వెంకటేశ్ గౌడ్,కృష్ణ గౌడ్, గొడుగు స్వామి,మేకల కనకయ్య,రమేష్ గౌడ్, దామరకుంట కృష్ణ,ఆయా గ్రామాల సర్పంచులు తీగుళ్ల కనకయ్య,రాజు,బచ్చలి మహిపాల్,కిరణ్ చారి, లకుదారం సర్పంచ్ నర్సింలు,ర్యాగల దుర్గయ్య,అర్జున్ గౌడ్,ఆకుల దేవేందర్,అహ్మద్,శివ కుమార్, మధుసూదన్ రెడ్డి,భీమప్ప, కౌన్సిలర్లు,సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీలు,గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు.






గజ్వేల్ పట్టణంలో వక్ బోర్డు భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తూతూ మంత్రంగా కూల్చేసిన మున్సిపల్ సిబ్బంది

# అర్హులకు నిరీక్షణ

## - అక్రమార్కులకు గ్రీన్ సిగ్నల్ !”

## అక్రమ నిర్మాణాలకు రాత్రికి రాత్రే అనుమతులా?”

## “గజ్వేల్ మున్సిపాలిటీలో అనుమతుల మాయాజాలం..





ఉదయం మున్సిపల్ సిబ్బంది కూల్చివేత
రాత్రికి రాత్రే స్లాబ్ నిర్మాణం
పట్టించుకొని అధికారులు

గజ్వేల్:03జూన్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో భవన నిర్మాణ అనుమతుల మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయంటూ స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన దరఖాస్తుదారులకు నెలల తరబడి అనుమతులు ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతుండగా,ప్రభుత్వ భూములు మరియు వక్ఫ్ బోర్డు స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు మాత్రం రాత్రికి రాత్రే అనుమతులు జారీ చేస్తున్నారంటూ మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటుకు ఫ్లెక్సీ కట్టి బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

**రూల్స్ సామాన్యులకేనా? అక్రమార్కులకు రెడ్ కార్పెటా?**

స్థానికుల కథనం ప్రకారం,సర్వే నంబర్ 333/దీ6లో తమ సొంతంగా ఉన్న 130 గజాల ఖాళీ స్థలంలో జి౦1 ఇంటి నిర్మాణం చేపట్టేందుకు కొంటోంతి నర్సమ్మ కుటుంబం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసింది.

ఈ మేరకు ఏప్రిల్ 30న రూ.1,20,275 లను డీడీ రూపంలో చెల్లించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణ అనుమతి మంజూరు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


అన్ని చట్టబద్ధమైన పత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు అనుమతి ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని, సామాన్య ప్రజలకు ఒక న్యాయం, అక్రమ నిర్మాణదారులకు మరో న్యాయం అమలు చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు.

**అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఎవరు ఇస్తున్నారు ?**


ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారికి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఎలా లభిస్తున్నాయని నిరసనకారులు ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో మున్సిపల్ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికి తీయాలని డిమాండ్ చేశారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

“మున్సిపల్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు మితిమీరిపోయాయి. అర్హులైన ప్రజలకు అనుమతులు ఇవ్వకుండా వేధిస్తూ, అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన అనుమతులను రద్దు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ బాబా,జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు జంగా అశోక్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటుకు ఫ్లెక్సీ కట్టి నిర్వహించిన ఈ నిరసన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.




మున్సిపల్ గేటు ముందు నిరసన




గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం

# అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

గజ్వేల్:03 జూన్ (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో అటవీశాఖ గజ్వేల్ రేంజ్ తరపున కల్పకవనం అర్బన్ పార్క్ లో నడక మరియు అటవీ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా అటవీశాఖ తరపున ఒకటో తారీకు నుండి ఆరవ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో మొదటి రోజు ఆర్డిఓ మేడం చేతుల మీదుగా పోస్టర్ విడుదల చేయడం జరిగిందని, రెండవ రోజు తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకలు, ఈరోజు వాసవి క్లబ్ మరియు అటవీశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ నివారణ కొరకు ఇంటింటా మొక్కలు నాటడం గురించి పర్యావరణ పరిరక్షణ కోసం,అటవీ జంతువులను కాపాడుటం కోసం, బైక్ ర్యాలీలో నినాదాలు చేస్తూ, అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. అనంతరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పవన్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ప్లాస్టిక్ వస్తువులను వాడటం నిషేధించాలని అటవీ ప్రాంతాన్ని పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్,వాసవి క్లబ్ జోన్ చైర్మన్ జగ్గయ్యగారి శేఖర్,అటవీ శాఖ అధికారులు డిఆర్ఓ రాజమణి ఫారెస్ట్ శిక్షణ అధికారులు శకావత్ హరిప్రసాద్,బీట్ అధికారులు కిషోర్ రాజు స్వామి ఐలయ్య ప్రసాద్,వాసవి క్లబ్ సభ్యులు కాశీనాథ్, కైలాస ప్రశాంత్, ఉమేష్,నితీష్ రాములు రమేష్ తదితరులు పాల్గొన్నారు



## కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుండి

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టండి

### సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి ని కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. అతి త్వరలో సంయుక్త సమావేశం..



పటాన్ చేరు జూన్ 3 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో కొల్లూరు, ఉస్మాన్ నగర్, నాగులపల్లి ప్రాంతాలలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి కేటాయించడం జరిగిందని.. గత కొంతకాలంగా అసాంఘిక శక్తులకు, మత్తు పదార్థాలకు కేంద్రాలుగా తయారవుతున్నాయని.. వెంటనే చర్యలు చేపట్టడంతో పాటు మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు బుధవారం గచ్చిబౌలిలోని సిపి కార్యాలయంలో కమిషనర్ రమేష్ రెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గల డివిజన్లలో గత కొంతకాలంగా మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువతతో పాటు విద్యార్థులు, పేద, మధ్యతరగతి ప్రజలు మత్తు పదార్థాలకు బానిసై.. అనారోగ్యానికి గురై ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో అత్యధిక శాతం అత్యంత నిరుపేదలు జీవనం కొనసాగిస్తున్నారని.. మత్తు పదార్థాల వినియోగం మూలంగా కుటుంబాలు రోడ్డున పడటంతో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో వెంటనే చర్యలు చేపట్టకపోతే తీవ్ర పరిణామాలు ఉత్పన్నమయ్యే పరిస్థితి ఏర్పడబోతున్నాయని సిపి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సిపి రమేష్ రెడ్డి.. అతి త్వరలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రగ్స్ వాడకం మూలంగా ఎదురయ్యే పరిణామాలను ప్రజలకు స్వయంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. నిరంతరం నిఘా పెట్టడంతో పాటు దుష్పరిణామాలపై వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు.



## అల్మాస్‌గూడ వినాయక హిల్స్ డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన బడంగ్‌పేట్ డిఈ అభినవ్ ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, జూన్ 03,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ సర్కిల్-16 నాదర్గుల్ డివిజన్-57 అల్మాస్‌గూడ వినాయక హిల్స్ కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. కాలనీలో స్థానిక డ్రైనేజీ సమస్యలను డి ఈ అభినవ్ స్వయంగా పరిశీలించారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన, రేపటి నుంచే డ్రైనేజీ మరమ్మతు పనులు ప్రారంభిస్తామని కాలనీవాసులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి,ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, అనిల్, పాల్గొన్నారు. కాలనీ సమస్యలపై సానుకూలంగా స్పందించి, వెంటనే పనులు పనులు ప్రారంభిస్తామని బరోసా ఇచ్చిన అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహణ.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 03.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక 99 డేస్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేటలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్




వినియోగం వల్ల మానవాళికి, పర్యావరణానికి కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హిత ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించేందుకు వ్యాసరచన, గ్రీన్ పర్యావరణంపై డ్రాయింగ్/పెయింటింగ్, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రసంగ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేయగా, విజేతలకు స్టీల్ వాటర్ బాటిళ్లను ప్రథమ, ద్వితీయ బహుమతులుగా అందజేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ శాస్త్రవేత్త శ్రీ టి. రవీందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే ముప్పును వివరించి, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, నేల అందించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ అనుకూల జీవన విధానాలను అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీ మధుసూదన్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# అధికారులు చెప్పేవరకు మా ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని మాకు తెలియదు

### బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి

### సిట్ విచారణ అనంతరం మీడియాతో బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత





మహేశ్వరం, జూన్ 03,(ప్రజా కలం)

అధికారులు చెప్పేవరకు మా ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని మాకు తెలియదని బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి అన్నారు. సిట్ విచారణ అనంతరం మీడియాతో బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత మాట్లాడుతూ 30 నిమిషాల పాటు నా స్టేట్మెంట్, నా భర్త స్టేట్మెంట్ ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. 2022 ఏడాదిలో నుండి ఎన్నికల సమయంలో మా ఇద్దరి ఫోన్లు ట్యాపింగ్ కి గురైనట్టు అధికారులు చెప్పారు. అధికారులు చెప్పేవరకు మా ఫోన్లు ట్యాపింగ్ కు గురైందని విషయం మాకు తెలియలేదని అన్నారు. భార్యాభర్తలిద్దరి ఫోన్లు ట్యాప్ చేయడం దురదృష్టకరం అన్నారు. నిరంతరం ప్రజా సేవలో మమేకమై ఉండడంతో .... మా ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు గుర్తించలేకపోయాం అన్నారు. గత ప్రభుత్వంలో మహిళా నేత, మాజీ మంత్రి మాపై ఇంత కక్ష్యతో వారికి నియోజక వర్గం లో మేము పోటీగా ఉంటామని దగ్గరుండి ఫోన్ ట్యాపింగ్ చేశారనే అనుమానం ఉందని ఎన్నికల సమయంలో మా కదలికలపై నిరంతరం నిఘా పెట్టేవారు.

కానీ అది ట్యాపింగ్ చేసి అనే విషయం ఇప్పుడు గుర్తించాం. మేము చేసే కార్యక్రమాలకు అడుగడుగున అడ్డు పడేవారు.. మా వ్యూహాలను ముందే పసిగట్టి ఎవరెవరు మాతో కలసి పని చేయాలనుకుంటున్నారు వారికి బెదిరింపులు గురి చేసేవారు. మహేశ్వరం నియోజకవర్గంలో మమ్ముల్ని ఎదగకుండా అడ్డుకోవడానికి ఈ విధమైన చర్యలు చేపడతారని గుర్తించలేకపోయం అన్నారు. ప్రజాక్షేత్రంలో దొంగ దారిన కాకుండా ప్రజాసేవలలో పోటీ పడి తేల్చుకోవాలి కానీ ఈ విధంగా కాదు. సిట్ పై పూర్తి నమ్మకం ఉ ఒదని రేవంతన్న ప్రభుత్వం తప్పకుండా మాకు న్యాయం చేస్తారని నమ్మకం ఉందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలైన నిందితులకు త్వరలోనే శిక్ష పడుతుందనీ నమ్ముతున్నాం అని అన్నారు.

# డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి

### సీఎంసీ కమిషనర్ సృజన ను కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్ చేరు జూన్ 3 (ప్రజా కలం)ప్రతినిధి

పటాన్చెరు అమీన్పూర్ సర్కిల్, పటాన్చెరు సర్కిల్ పరిధిలోని తొమ్మిది డివిజన్ల సమగ్ర అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడంతో పాటు.. తెల్లాపూర్, అమీన్పూర్, బొల్లారం మున్సిపాలిటీలు జిహెచ్ఎంసిలో విలీనమయ్యే సమయంలో గల 250 కోట్ల రూపాయల మిగులు నిధులను సైతం డివిజన్ల అభివృద్ధికి మంజూరు చేయాలని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు

బుధవారం గచ్చిబౌలిలోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ సృజనతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు ప్రధానంగా మినీ స్టేడియాలు, చెరువులు, స్మశాన వాటికలు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. రెండు సర్కిళ్ల పరిధిలో శరవేగంగా నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని.. ఇందుకు అనుగుణంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విధి దీపాల ఏర్పాటుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్ సృజన.. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమై పలు అంశాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపిస్తుందని.. దీని మూలంగా అభివృద్ధి పనులు నెమ్మదిగా సాగుతున్నాయని తెలిపారు. నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ పరిష్కరించాలని సూచించారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలో వరద నీటి సమస్య పరిష్కారానికి ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందని.. కాలువల నిర్మాణానికి 10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయబోతున్నట్లు జోనల్ కమిషనర్ అమిత్.. ఎమ్మెల్యే జిఎంఆర్ కు తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలో గల రేడియం రోడ్డు లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఉర్జిత్ విల్లాస్ సమీపంలో వరద నీటి సమస్య పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మినీ స్టేడియాల అభివృద్ధికి వెంటనే నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్సీ శంకరయ్య, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.





## నాణ్యమైన విద్యకు ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్ చిరునామా.

సిద్దిపేట ప్రజాకలం 03.

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రథమ సంవత్సర ప్రవేశాలు కొనసాగుతున్నాయి. కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సిఇసి, హెచ్ ఈ సి జనరల్ కోర్సులతో పాటు కామ్, ఎస్సీ వృత్తి విద్యా కోర్సులో కూడా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. 2009 సంవత్సరం నుంచి అంకితభావం, వృత్తి నిబద్ధత కలిగిన అధ్యాపకుల సేవలతో విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి కళాశాల కృషి చేస్తోంది. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, క్రీడా పరికరాలు, ఆధునిక ప్రయోగశాలలు కళాశాల ప్రత్యేకతలు. విద్యార్థులకు ప్రభుత్వ ఉపకార వేతనాలు అందించడంతో పాటు, వారి విద్యా ప్రగతికి అనుగుణంగా నిరంతరం స్టూడెంట్ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి భవిష్యత్‌కు దిశానిర్దేశం చేస్తోంది. అందువల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్‌లో అడ్మిషన్లు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ పత్రికాముఖంగా విజ్ఞప్తి చేశారు.



## వరి ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన రైతన్నలు.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 03.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, వీరనగర్ గ్రామాలకు చెందిన రైతులు బుధవారం గజ్వేల్--చేగుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తమ వద్ద ఉన్న వరి



ధాన్యాన్ని ఇప్పటికీ కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ సుమారు 50 శాతం వరి ధాన్యం కొనుగోలు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో కొంతసేపు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. తోగుట సీఐ లతీఫ్ సాయంత్రం లారీలను పంపిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



## రామారం రైస్ మిల్లులో భారీ అక్రమాల వెలుగులోకి.. పీడీఎస్ బియ్యం స్వాధీనం.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 03.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం గ్రామంలోని రైస్ మిల్లుపై సోమవారం అధికారులు నిర్వహించిన దాడుల్లో వందలాది బస్తాల్లో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం బయటపడింది. ఈ నేపథ్యంలో అధికారులు రాత్రి వరకు తనిఖీలు నిర్వహించారు. అధికారుల విచారణలో గుర్తించిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, తంగళ్లపల్లిలోని పరమేశ్వరి రైస్ మిల్లు పేరుతో ఉన్న గోనె సంచుల్లో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. గతంలో ప్రభుత్వం బియ్యం నూర్పిడి కోసం ఈ మిల్లుకు సరఫరా చేసిన సుమారు 30 వేల బస్తాల వడ్లు నిల్వ ఉండాల్సి ఉండగా, అందుకు తగ్గ నిల్వలు లేనట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ ఏడాది ప్రభుత్వం వడ్ల కేటాయింపులను నిలిపివేసినట్లు తెలిసింది. ప్రస్తుతం మిల్లులో పట్టుబడిన 297 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కొత్తపల్లి సమీపంలోని రైస్ మిల్లుకు తరలించారు. అలాగే మిల్లులో నిల్వ ఉండాల్సిన వడ్లలో 6,087 క్వింటాళ్లు తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీఎస్పీ వెంకటేశం, సీఐ పండరి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, ఏఎస్వో సాయిరవి, రాయపోల్ ఏఎస్ఐ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



## ముప్కాల్‌లో కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 03:

కుటుంబ కలహాలు తట్టుకోలేక ఓ వ్యక్తి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన ముప్కాల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన షేక్ ఆయూబ్ (36) అనే వ్యక్తికి ఏడేళ్ల క్రితం ఆలూరు మండల కేంద్రానికి చెందిన యువతితో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. అయితే, గత ఆరు నెలలుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల ముప్కాల్ దూలాగుట్ట వద్ద ఇరువర్గాల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పినప్పటికీ వీరి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆయూబ్, బుధవారం తెల్లవారుజామున తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముప్కాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## మద్యానికి బానిసై హోటల్ నిర్వాహకుడు ఆత్మహత్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 03:

ముప్కాల్ మండలం వెంచిర్యాల గ్రామంలో బుధవారం ఉదయం ఓరిగంటి శివ (41) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు



పాల్పడ్డాడు. స్థానికులు మరియు పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన శివ, అతని కుటుంబం బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం వెంచిర్యాల గ్రామానికి వలస వచ్చారు. గ్రామంలో ఒక హోటల్ నడుపుకుంటూ భార్యాభర్తలు ఇద్దరూ కుటుంబాన్ని ఈ పోషించుకుంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.అయితే, శివ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలంటూ భార్యతో తరచూ గొడవకు దిగేవాడు. బుధవారం ఉదయం కూడా మద్యం కోసం డబ్బులు లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముప్కాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## తెలంగాణ ప్రైవేటు బస్సుల అరాచకాలు అరికట్టాలి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 03:

మంగళవారం మధ్యాహ్నం ముంబైలోని తాడ్దేవ్ ఆర్.టి.ఓ కార్యాలయంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), తెలుగు సమాజ్ బాహిచార కమిటీ ముగ్గురు ప్రతినిధుల బృందం డిప్యూటీ ఆర్.టి.ఓ ఇన్స్పెక్టర్ నిఖిల్ సాలుంకే గారికి మళ్ళీ పాత మరియు కొత్త పిర్యాదులు చేయడం జరిగింది. ముఖ్యంగా ముంబై మహానగరం నుంచి తెలంగాణలోని నిజామాబాద్ కరీంనగర్ లకు వెళ్ళే తొమ్మిది ప్రైవేటు బస్సుల దోపిడి అరాచకాలపై లిఖితపూర్వకంగా కంప్లైంట్ అయ్యింది. అందులో బస్సులు పెంచిన అత్యధిక టికెట్ల ధరలు, ప్రాణాంతక భారీ లోడింగ్, అపరిశుభ్రత, మహిళ కోసం సౌకర్యాల లేమి, పలు బసు డ్రైవర్లు తప్పతాగి డ్రైవింగ్ చేయడం, యాత్రికుల నగలు సామానుల చోరీలు, తెలంగాణ ప్రయాణికులను బెదిరించడం అవమానపర్చడం లాంటివి నిత్యకృత్యలైనాయి. ఈ బస్సుల యాజమాన్యాలపై త్వరలో కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ అధికారి బృందానికి హామీచ్చారు. ఇందులో బీఎస్పీ మహారాష్ట్ర కార్యదర్శి నాగసేన్ మాలజీ, జర్నలిస్టులైన గుర్రం నరేష్ మహరాజ్, ఎం. మాలజీ లు ఉన్నారు.



### పవన్ కళ్యాణ్.. ముమ్మాటికీ తెలంగాణ ఈ భూమి పుత్రుల జాగీరే.

# ఇక్కడున్న నాలుగు కోట్ల మంది జాగీరే

**-పవన్ కళ్యాణ్ నువ్వు సినిమాలు తీసుకో,పైసల్ సంపాదించుకో,**

**నువ్వు ఆంధ్రా నుండి తెచ్చుకున్న కమీషన్లు హైదరాబాద్ లో దాచిపెట్టుకో మాకు అభ్యంతరం లేదు**

**-తెలంగాణ తెచ్చిన ప్రదాత,కర్త,కర్మ,క్రియ,**

**మా ప్రొడ్యూసర్,డైరెక్టర్, హీరో ఒకే ఒక్కరూ మా కేసీఆర్ -తెలంగాణ రియల్ OG మా కేసీఆర్**

**- తెలంగాణ సినిమాను క్రియేట్ చేసి,**

**భారతదేశ పటంలో పెట్టింది కర్త,కర్మ,క్రియ గాడ్ ఫాదర్ మన కేసీఆర్**

**-పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న జీవన్ రెడ్డి ఫైర్**



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)జూన్ 03:

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మరియు ఎస్ఐఆర్ సన్నాహక సమావేశంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ గురించి మాట్లాడే ముందు పవన్ కళ్యాణ్ తెలంగాణ చరిత్రను, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాలతో వచ్చినది కాదని, వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, విద్యార్థుల పోరాటాలు, కోట్లాది ప్రజల ఆకాంక్షల ఫలితంగా సాధించుకున్న రాష్ట్రం అని స్పష్టం చేశారు. "తెలంగాణ ముమ్మాటికీ ఈ నేలపై నివసిస్తున్న నాలుగు కోట్ల ప్రజలది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులభం కాదు తెలంగాణ ఉద్యమం. తెలంగాణ గురించి అవగాహన లేకుండా మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు" అని హెచ్చరించారు. తెలంగాణ సాధనకు కర్త, కర్మ, క్రియ ఒక్క కేసీఆరేనని, ఉద్యమానికి నాయకత్వం వహించి రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి పథంలో నడిపించిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. "తెలంగాణకు ప్రొడ్యూసర్, డైరెక్టర్, హీరో ఎవరైనా ఉంటే అది ఒక్క కేసీఆరే. తెలంగాణ అనే సినిమాను సృష్టించి భారతదేశ పటంలో గర్వంగా నిలబెట్టిన గాడ్‌ఫాదర్ కేసీఆర్" అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలని, ఆంధ్ర రాజకీయాల ప్రభావంతో తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఏ వ్యాఖ్యనైనా బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర సాధన కోసం పోరాడని వారు, ఉద్యమ చరిత్రలో భాగం కాని వారు తెలంగాణ గురించి ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం శాశ్వతమని, ఆ స్థానాన్ని ఎవరూ చెరపలేరని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా,బాజిరెడ్డి గోవర్ధన్,హన్మంతు షిండే,మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, ఇంచార్జ్ రవీందర్ సింగ్,పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సిర్ప రాజు,సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి,సుజీత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గూని సురేష్ నియామకం



**భూదాన్ పోచంపల్లి, జూన్ 3 (ప్రజా కలం )**

జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి గ్రామానికి చెందిన గూని సురేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ కార్యవర్గం బుధవారం ఒక ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలను విస్తృతం చేయడంలో భాగంగా ఈ నియామకం చేపట్టినట్లు జాతీయ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందుకున్న సురేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నియమ నిబంధనలు (బై-లాస్) అనుసరిస్తూ, భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనకు, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ నియామకం రెండేళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అమలులో ఉంటుందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సురేష్ నియామకం పట్ల పలువురు కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దంగుల బాలరాజు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు స్వామి, పోచంపల్లి మండల అధ్యక్షులు కరగల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా జక్కం అశోక్ ఏకగ్రీవ ఎన్నిక

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 03:



మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ బీసీ (డీ.జ) సెల్ అధ్యక్షులుగా జక్కం అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ బలోపేతానికి, బీసీ సామాజిక వర్గాల సంక్షేమానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా జక్కం అశోక్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఇంతటి కీలకమైన పదవిని అప్పగించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ గారికి, అలాగే కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మండలంలో పార్టీ అభివృద్ధికి శ్రమిస్తానని, బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతానని ఆయన స్పష్టం చేశారు. అశోక్ గారి ఎన్నిక పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.**

వలిగొండ జూన్ 3 ప్రజాకలం:వేసవి సెలవుల్లోనే పాఠశాలలోని పెండింగ్ పనులను యుద్ధ ప్రతిపదికన పూర్తి చేసి జూన్ 12వ తేది నాటికి పాఠశాల ప్రారంభానికి సర్వం సిద్ధం చేయాలని,పాఠశాలల నిర్వాహకులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.బుధవారం మండల పరిధిలోని లోతుకుంట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడుతూ వేసవి సెలవుల సమయాన్ని పాఠశాల నిర్వాహకులు సద్వినియోగం చేసుకొని పెండింగ్ పనులను పూర్తి చేసి



పాఠశాలలను అన్ని హంగులతో మౌలిక సదుపాయాలను కల్పించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అనంతరం పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి నాగారం గ్రామ పరిధిలోని వాసవి రైస్ మిల్లును తనిఖీ చేసి 40 వేల బస్తాలను దిగుమతి చేసుకోవాలని,మిల్లు నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, డీఈవో బిక్షపతి,జీవోడీవో రాధ,సర్పంచ్ రాములు, ఎంపీడీవో జలంధర్ రెడ్డి, తహసీల్దార్ ధశరథ,మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్,దుర్గ,పౌరఫరాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జీడిమెట్ల సర్కిల్ ప్రజల నీటి సమస్యల పరిష్కారించండి:భరత సింహారెడ్డి

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) జీడిమెట్ల సర్కిల్ ప్రజల నీటి సమస్యల పరిష్కారించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి అధికారులను కోరారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని కుత్బుల్లాపూర్ డివిజన్, పేట్ బషీరాబాద్ డివిజన్ మరియు పద్మానగర్ డివిజన్ (జీడిమెట్ల డివిజన్) ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సరఫరా, పెండింగ్ యూజీడీ పనులు, డ్రైనేజీ నిర్వహణ సమస్యలపై వాటర్ వర్క్స్ డి.జి.ఎం. ప్రసాద్ బాబుకి స్థానికులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలకు సరిపడా పరిమాణంలో సమయానికి మంచి నీటి సరఫరా అందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. యూజీడీ మరియు డ్రైనేజీ లైన్లను క్రమం తప్పకుండా శుభ్రపరచి నిర్వహించాలని కోరారు. జీడిమెట్ల సర్కిల్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, వీరారెడ్డి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, ప్రభాకర్ రెడ్డి, సాయిబాబా, గంగాధర్, ప్రవీణ్ గౌడ్, పాపయ్య దొర, రామన్, బాలరాజ్, మహేష్, శ్రవణ్ బోస్, శ్రవణ్, అంజయ్య, జ్ఞానేశ్వర్, [redacted]ల్ యాదవ్, రాజు, కైలాసం, నరేందర్ రెడ్డి, రాజేష్, శివ, వెంకట[redacted] నోముల శ్రీనివాస్, సతీష్, రన్వీత్ గుప్తా తదితరులు పాల్గొన్నార[redacted]

## టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మనీషా విష్ణు నియామకం

హైద్రాబాద్ జూన్ 3 (ప్రజాకలం న్యూస్)

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మనీషా విష్ణును నియమించినట్లు ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు.ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ తోపాటు ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా మనీషా విష్ణు అందుకున్నారు. పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఎస్సీ విభాగాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత చైతన్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో మనీషా విష్ణు కీలక పాత్ర పోషిస్తారని డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు.తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని మనీషా విష్ణు తెలిపారు.



## మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళా సంఘాలతో సమావేశం

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ఆధ్వర్యంలో, మహిళా వారోత్సవాల సందర్భంగా 292 సాయిబాబా నగర్ డివిజన్‌లోని మహిళా సంఘాల గ్రూప్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు



తూ...మహిళా సంఘాల సభ్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. వాటి ద్వారా మహిళలకు కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఈకార్యక్రమంలో బాదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సమైక్య లీడర్లు జ్యోతిరెడ్డి, కుర్షిత్ బేగం, భాస్కర్ రెడ్డి, శ్యామ్, గురవారెడ్డి, సత్తిరెడ్డి, గోపాల్, అనితరెడ్డి, కుమారి మరియు డ్వాక్రా మహిళా సంఘాల గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



# ఆధిపత్య పార్టీలకు ఇక దింపుడుగల్లమే

**-భువనగిరి సభతో ఆ పార్టీలు గల్లంతు**

**- రెడ్లు,రావులను ఇగ అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వం...**

**-లక్ష మందితో భువనగిరిలో భారీ బహిరంగ సభకు టీఆర్పీ సిద్ధం...**

**-సభకు రాజ్యాధికార సమరభేరిగా నామకరణం**

**-7200 లక్ష్యం నెరవేరింది... ఇగ మిగిలింది బీసీ రాజ్యాధికారమే..**

**-పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం**

**-టీఆర్పీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్**

**-పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్**



యాదాద్రి భువనగిరి జూన్ 3 ప్రజాకలం:

తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ గారి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమావేశం భువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్ లో నిర్వహించారు.జూలై 5 న భువనగిరి బహిరంగ సభ కోసం ఏర్పాటు చేసిన 13 కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు..ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ హాజరై పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ జూలై 5వ తేదీన భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు రాజ్యాధికార సమరభేరిగా పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నామకరణం చేసినట్లు ప్రకటించారు.అలాగే సభ నిర్వహించే స్థలం అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ కి బెల్లి లలిత సభా ప్రాంగణంగా నామకరణం చేసినట్లు తెలిపారు.భువనగిరి సభ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో సమూలమైన మార్పులు జరుగుతాయని,అగ్రవర్ణ పార్టీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు.ఇప్పటికే తీన్మార్ మల్లన్న లేవనెత్తిన బీసీ ఉద్యమ నినాదం రెడ్ల,రావుకు నిద్ర లేకుండా చేస్తుందని,ఎలాగైనా బీసీ వాదాన్ని అణిచివేయాలని అగ్రవర్ణ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని అన్నారు.ఐతే వారు కుట్రలను ఎప్పటికప్పుడు పసి గడుతున్న తీన్మార్ మల్లన్న తనదైన శైలిలో ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. భువనగిరి రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయడానికి రాష్ట్ర స్థాయి నాయకులు నుండి గ్రామ కార్యకర్త వరకు కలిసి కట్టుగా పని చేస్తూ సభ నిర్వహణ కోసం పార్టీ ఏర్పాటు చేసిన 13లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ యాదవ్ మాట్లాడుతూ,భువనగిరి సభను ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకొని సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు..అలాగే రాబోయే రోజుల్లో ఈ అగ్రవర్ణ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ప్రజలందరూ నూతన పార్టీ వైపు చూస్తున్నారని,మన పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందని తెలియజేశారు.గతంలో తీన్మార్ మల్లన్న స్థాపించిన 7200 గురించి ఈ సందర్భంగా మాదం రజినీ యాదవ్ క్లారిటీ ఇచ్చారు.7200 అనేది రాష్ట్రంలో ఉన్న వెలమల ఇండ్ల గడపల సంఖ్య అని, కేసీఆర్ ను గద్దె దింపడం కోసం 7200 అనే మూమెంట్ ను తీసుకొచ్చి ఆ మూమెంట్ ద్వారా ప్రజలను చైత్యన పరిచి కేసీఆర్ గద్దె కూల్చామని వివరించారు.7200 అంతం కాలేదని అది విజయం సాధించి బీసీ రాజ్యాధికార స్థాపన కోసం మరో ఉద్యమ పంథాలోకి మారిపోయిందని స్పష్టం చేశారు..మల్లన్న గారి నాయకత్వంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రోజు రోజుకు బల పడుతుందని,పార్టీ గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి మరింతలా బలోపేతం చేస్తూ ప్రతి గ్రామం నుండి భువనగిరి బహిరంగ సభకు ప్రజలను తరలించేలా ప్రత్యేక ప్రణాళిక సిద్దం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వాడుతూ ప్రజలను నిత్యం చైత్యన పరచాలని పిలుపునిచ్చారు..అనంతరం పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి పలువురు జిల్లా స్థాయి సభ్యులను రాష్ట్ర కమిటీలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు..అలాగే భువనగిరి జిల్లాకు సంబంధించి పలువురికి పదవులు ఇస్తూ నియామక పత్రాలు భువనగిరి జిల్లా అధ్యక్షులు కొమిరిశెట్టి నర్సింహులు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ చేతుల మీదుగా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గంగాధర్ లింగాల, వేములవాడ మదన్ మోహన్ చారి,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్,క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బంధారపు నర్సయ్య,కోశాధికారి కొక్కలకొండ మనోజ్,మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్,రాష్ట్ర కార్యదర్శులు ఆర్.భవన్ వెంకటేష్,నగేష్ ముదిరాజ్,రమేష్ యాదవ్, కొమ్ముల ప్రవీణ్ రాజ్,ఆకుల హనుమాన్లు, శివవీర్ రెడ్డి, పసల ప్రసన్న,అఖిల్ పాషా,రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మనోజ్ ఆకుల,యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్ర శేఖర్,కార్మిక విభాగం అధ్యక్షుడు సంకూరి శ్రీనివాస్,విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజు,మైనారిటీ విభాగం అధ్యక్షులు సల్మాన్,ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్, రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్,సుతారపు రంగన్న తో పాటు 33 జిల్లాల అధ్యక్షులు,13 కమిటీల కన్వీనర్లు సభ్యులు,పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# మట్టిలో మాణిక్యం

## సామాన్య వ్యవసాయ రైతు కుటుంబంలో పుట్టి డాక్టర్ అయిన రాహుల్



చేవెళ్ల జూన్ 3(ప్రజాకలం న్యూస్)

చదువుపై ఆశ,కృషి పట్టుదల సరైన లక్ష్యం ఉంటే సాధించలేనిది ఏమీ లేదని నిరూపించాడు ఓ సాధారణ పేద మధ్యతరగతి వ్యవసాయ రైతు కుటుంబం నుంచి వచ్చిన పల్లెటూరి పిల్లగాడు.చదువు మీద ఆసక్తి,జిజ్ఞాస దానికి తోడు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచి చదువులో ప్రతిభ కనపరుస్తూ పెద్దలపట్ల గౌరవం,వినయం,విధేయత పట్టుదలలే నేడు కండంతరాలు దాటి ఎంబీబీఎస్ చదువు పూర్తిచేసి డాక్టర్ పట్టా అందుకుని అందరి ప్రశంసలు పొంది తున్నాడు. ఎంతో మంది పేద విద్యార్థులు కష్టాలను అధిగమించి,ఉన్నత చదువుల్లో అద్భుతమైన విజయాలు సాధించారు.సరైన పట్టుదల,లక్ష్యం ఉంటే పేదరికం విజయం సాధించడానికి అడ్డుకాదని నిరూపించాడు ముక్కు రాహుల్...

రంగారెడ్డి జిల్లా,షాబాద్ మండలం లోని నరెడ్లగూడ అనే చిన్న గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యవసాయ రైతు కుటుంబానికి చెందిన ముక్కు విశ్వం,సునీత దంపతుల కుమారుడు ముక్కు రాహుల్.ఆ ఊరి పిల్లలు బడికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు కాలినడకన నడుచుకుంటూ వెళ్లి షాబాద్ మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలి.అలా కాలినడకన నాలుగు కిలో మీటర్లు నడుచుకుంటూ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు పొంది ఉత్తమ విద్యార్థిగా చదువు చెప్పే గురువుల చేత శభాష్ అనిపిం చుకున్నాడు.తన చిన్నతనం నుండే చదువులో అత్యంత ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు తమ కుమారున్ని ప్రోత్సహించారు.చదువుతో పాటు క్రీడల పట్ల చురుకుగా పాల్గొంటూ అందరి మన్ననలు పొందుతున్న కొడుకును చూసి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.


నా కొడుకు డాక్టర్ అవడం సంతోషంగా ఉన్నది...ముక్కు విశ్వం

ఎంబిబిఎస్ లో డాక్టరేట్ పట్టా అందుకున్న తన కుమారున్ని చూసి ఎంతో సంతోషంగా ఉంది.మా కుటుంబాలలో ఎవరు పెద్ద చదువులు చదవలేదు.మా అబ్బాయి డాక్టర్ చదవడం పట్ల మా కుటుంబాలలో ఎంతోమంది అభినందనలు తెలుపుతున్నారు. ఎంతోమంది పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే కోరిక నా కొడుకు ద్వారా తీరడం చాలా గర్వంగా ఉందని ముక్కు విశ్వం ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

# రాష్ట్ర కార్యదర్శిగా పెండ్యాల విజయభాస్కర్‌కు ఘన సన్మానం

జూలూరుపాడు, జూన్ 3 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పెండ్యాల విజయభాస్కర్‌ను కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ధారా నగేష్, ప్రధాన కార్యదర్శి కోదుమూరు సురేష్‌లు పూలమాలలు, శాలువాలతో విజయభాస్కర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ధారా నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణమన్నారు. సంఘ అభివృద్ధితో పాటు పేద ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం విజయభాస్కర్ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ పట్టణ కార్యవర్గ సభ్యులు ఉప్పల శ్రీనివాస్, కూర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వండి

**-అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇవ్వాలి**

**-ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి**

హైదరాబాద్, జూన్ 03 (ప్రజా కలం ప్రతినిధి)

సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది. అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

మద్దతు ప్రకటించిన కోదండరాం

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరు కావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు.

గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com